## ట్రంప్ ప్రకటనతో ఊపు

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక్క ప్రకటన క్రిప్టో మార్కెట్లోకి 300 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.26 లక్షల కోట్లును చొప్పించింది. ఆయన ఆదివారం రాత్రి ఐదు క్రిప్టో కరెన్సీలను అమెరికా వ్యూహాత్మక రిజర్వులుగా ఉంచాలనుకొంటున్నట్లు సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు. ఈమేరకు ప్రెసిడెన్షియల్ వర్కింగ్ గ్రూప్ క్రిప్టో వ్యూహాత్మక రిజర్వులు ఏర్పాటుచేసేలా పని చేయాలని మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ రిజర్వుల్లో ఎక్స్‌ఆర్‌పీ, ఎస్‌వోఎల్(సోలాన,), ఏడీఏ (కార్డనో) కరెన్సీలను చేర్చాలన్నారు. ఆ తర్వాత గంటన్నరకు బిట్‌కాయిన్, ఎథర్‌ను కూడా చేర్చాలని పోస్టు పెట్టారు. గతంలో ట్రంప్ క్రిఏటోలపై ఎగ్జిక్యూటీవ్ ఆర్డర్ జారీ చేసిన సమయంలో కాయిన్ల పేర్లను ప్రస్తావించలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడి ప్రకటన వెలువడిన వెంటనే ఐదు క్రిప్టో కరెన్సీల విలువ దూసుకెళ్లింది. ఇక వీటిని అమెరికా ఎలా నిల్వలు చేస్తుందనే అంశంపై మాత్రం వివరాలు వెల్లడి కావాల్సిఉంది. ఎక్స్‌ఆర్‌పీ, ఎస్‌వోఎల్, ఏడీఏ విలువ 62శాతం పెరగ్గా.. బిట్‌కాయిన్, ఎథర్ విలువ 10శాతానికి పైగా ఎగసింది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :11 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 05-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## మహా రాజకీయాల్లో కాకరేపుతున్న సర్పంచ్ హత్య కేసు..



ముంబై:మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మంత్రివర్గంలోని కీలక నేత తన పదవికి రాజీనామా చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్న ధనంజయ్ ముండే రిజైన్ చేశారు. సర్పంచ్ హత్య కేసులో ఆయనపై ఆరోపణలు రావడంతో సీఎం ఫడ్నవీస్ సూచనల మేరకు ధనంజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆయన రాజీనామాను తాను ఆమోదించినట్లు సీఎం తెలిపారు. అనంతరం ఆ రాజీనామా పత్రాన్ని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపినట్లు మీడియాకు తెలిపారు.కాగా, బీడ్ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్‌ను డిసెంబర్ 9న కొందరు దుండగులు కిడ్నాప్ చేసి హత్య చేశారు. ఈ హత్య స్థానిక రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఈ హత్య కేసులో మంత్రి ధనంజయ్ ముండే సహాయకుడు వాల్మిక్ కరాడ్ పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. దీంతో అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీడ్ జిల్లా పోలీస్ స్టేషన్‌లో ఉన్న నిందితుడిని మంత్రికి అత్యంత సన్నిహితుడైన బాలాజీ తండాలే కలవడం చర్చకు దారితీసింది. ఈ ఘటన రాజకీయంగానూ వేడి పుట్టించింది. ఈ క్రమంలో ధనంజయ్‌పై ప్రతిపక్షాలతో పాటు పలువురు మహాయుతి నేతలు సైతం విమర్శలు చేస్తున్నారు. దర్యాప్తు అధికారులు, స్థానిక రాజకీయ నేతలు కుమ్మక్కయ్యారని ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) నేతలు ఆరోపిస్తున్నారు. దర్యాప్తులో పారదర్శకత కొరవడిందని, మంత్రి ముండే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఫడ్నవీస్ మంత్రి ధనంజయ్‌ను రాజీనామా చేయమని కోరినట్లు తెలుస్తోంది. సీఎం సూచన మేరకు ధనంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం.

## వరంగల్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ అమలు చేయడం లేదు..



హైదరాబాద్,కాంగ్రెస్ రైతుల కోసం ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్ అమలు కావడం లేదు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రైతుబంధు, రైతు బీమా దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.రూ. 6,122 కోట్లు రైతులకు ప్రీమియం కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది.. కానీ, కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంటు, రైతుబంధు, రైతు బీమా రావడం లేదు అని ఆరోపించారు. రైతు భరోసా కోసం ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టి రూ. 10 వేల కోట్లు తెచ్చి ఏం చేశారు అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయి.. చీఫ్ సెక్రటరీతో ప్రభుత్వం అబద్దాలు చెప్పిస్తోంది.. రైతుల పంటలు ఎండుతుంటే రైతు కమీషన్ ఏం చేస్తోంది.. ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖ మంత్రులు రైతుల దగ్గరకు వెళ్ళండి నిరంజన్ రెడ్డి సూచించారు.ఇక, SLBC టన్నెల్ కూలితే కేసీఆర్ కారణమని అంటున్నారు.. రైతుల పంటలకు నీళ్లు ఇవ్వకపోవడానికి కారణం కేసీఆర్ అని అంటారా?.. అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అడిగారు. రైతుల దగ్గరకు వెళ్ళే ధైర్యం మంత్రులకు ఉందా?.. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు.. ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ లేదు.. సమయం వచ్చినప్పుడు రైతులు ప్రభుత్వాన్ని శిక్షించండి అని ఆయన పేర్కొన్నారు. చేతులు జోడించి చెబుతున్నాను.. రైతులు తమ ప్రాణాలను తీసుకొని శిక్షించుకోవద్దు అన్నారు.

## రేవంత్ రెడ్డి బీజేపీ మీద ఎదురుదాడి చేస్తున్నారు..



హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తీవ్రంగా మండిపడ్డారు. పాలన చేతకాక అయోమయ, గందరగోళంతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారు రేవంత్ రెడ్డి అని ఆరోపించారు.రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ ముసుగులో గత ప్రభుత్వంలోని బీఆర్ఎస్ నేతలు లబ్ధి పొందారు.. ఆ ప్రాజెక్ట్ ఉత్తర భాగం రైతులకు నష్టం చేశారు అని పేర్కొన్నారు. ఇక, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ రైతులకు న్యాయం చేస్తామని ప్రియాంక గాంధీతో చెప్పించారు.. కానీ, ఇప్పటి వరకు న్యాయం చేయలేదు.. అలైన్ మెంట్ మార్చలేదు అని ఆయన చెప్పుకొచ్చారు. ఉత్తర భాగం రైతులు అలైన్మెంట్ మార్చాలని అడిగితే పట్టించుకోని ముఖ్యమంత్రి.. దక్షిణ భాగంలో మాత్రం మార్చారు.. దీనిలో ఆంతర్యం ఎంటి.. రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చాలని అనుకుంటున్నారా అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు.ఇక, రిజనల్ రింగ్ రోడ్డ్ ప్రాజెక్ట్ డీపీఆర్ లోపభూయిష్టంగా ఉంది అని భారతీయ జనతా పార్టీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ మీద ఎదురు దాడి చేస్తున్నారు.. కేసీఆర్ చేసిన తప్పిదాలే ఆయన చేస్తున్నారు.. కేసీఆర్ కు పట్టిన గతే అతడికి పడుతుంది అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది కాబోతుంది అని విమర్శలు గుప్పించారు.

## తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు...



హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీ ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడుతున్నాయి. తెలంగాణలోని కరీంనగర్- నిజామాబాద్- ఆదిలాబాద్- మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది.మొదటి ప్రాధాన్యత ఓటుతో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించారు. ఎలిమినేషన్ లేకుండానే మొదటి ప్రాధాన్యత కావాల్సిన కోటా కింద 12081 కంటే ఎక్కువ ఓట్లు సాధించారు కొమురయ్య. ఇప్పటి వరకు 24,144 ఓట్లు లెక్కింపు పూర్తి కాగా బీజేపీ అభ్యర్థి కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. వంగ మహేందర్ రెడ్డికి 7182, అశోక్ కుమార్ కు 2621, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు వచ్చాయి.కరీంనగర్-మెదక్- నిజామాబాద్ -ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు పూర్తైంది.

మొత్తం 25,041 ఓట్లు పోలవ్వగా..వీటిలో 24144 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 897 ఓట్లు చెల్లనవి ఉన్నాయి. గెలుపు కోటా ఓట్లు 12,073 గా నిర్ధారించారు. వీటిలో బీజేపీ అభ్యర్థి మల్క కొముర య్యకు 12,959 ఓట్లు పోల్ అయ్యాయి.నల్గొండ-వరంగల్-ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ గా పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో ఈయన గెలుపొందారు.ఏపీలో..ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఆయన గెలుపొందారు. గాదె శ్రీనివాసులకు 10,068 ఓట్ల మ్యాజిక్ ఫిగర్ దాటడంతో ఆయనను విజేతగా ప్రకటించారు. వెయ్యికి పైగా ఓట్లు చెల్లనవిగా ఉన్నాయని అధికారులు తెలిపారు. విజేతను డిసైట్ చేసే ప్రక్రియలో 8 మందిని ఎలిమినేషన్ చేయాల్సి వచ్చిందన్నారు.

### కృష్ణా-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 17,246 ఓట్లు, పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు 7156 ఓట్లు వచ్చాయి. మూడో రౌండ్ ముగిసేసరికి ఆలపాటి రాజా 30,065 ఓట్ల మెజార్టీతో దూసుకుపోతున్నారు. మొదటి రౌండ్‌లో ఆలపాటికి 17,246 ఓట్లు, రెండో రౌండ్‌లో 17,506 ఓట్లు, మూడో రౌండ్‌లో 16,722 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి కేఎస్ లక్ష్మణరావు తొలి రౌండ్‌లో 7,156, రెండో రౌండ్‌లో 6,710, మూడో రౌండ్‌లో 7403 చొప్పున ఓట్లు వచ్చాయి. మొత్తంగా తొమ్మిది రౌండ్‌లు కాగా ఒక్కో రౌండ్‌లో 28 వేల ఓట్లు చొప్పున లెక్కిస్తున్నారు.

### ఉభయ గోదావరి జిల్లాల్లో

ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. 243 పోస్టల్ బ్యాలెట్లకు గాను 201 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లగా, 42 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. బ్యాలెట్లను కట్టలు కట్టేందుకు 12 గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తంగా 2,18,902 ఓట్లు పోల్ అయ్యాయి. మొత్తం 8 రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. రాత్రి 10.30గంటల తర్వాత తొలి రౌండ్ ఫలితాలు వచ్చే అవకాశం ఉందని కౌంటింగ్ అధికారులు తెలిపారు. మొత్తం 700 మంది కౌంటింగ్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నారు.

## రెండురోజులుగా ఢిల్లీలోనే సీఎం,మిగిలిన మంత్రులు



హైదరాబాద్,మార్చి4: ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన రెండోరోజు కొనసాగింది. కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం, మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్రమంత్రి చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. 2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ. 1,468.94 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతి చేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ. 343.27 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎంఆర్ డెలివరి గడువును పొడిగించాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. గత పదేళ్లుగా తెలంగాణలో ఎక్కడా కూడా రేషన్ కార్డు అమలుకాలేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు రేషన్ కార్డులను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే రేషన్ కార్డుల ప్రక్రియను కూడా ముమ్మరం చేశారు. రేషన్ కార్డుల కోటా కింద రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు ధాన్యం, సబ్సీడీని కేంద్రం ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధాన్యం సేకరణ పెద్ద ఎత్తున జరిగింది. దాదాపు 66.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో ధాన్యం ప్రెక్యూర్‌కు సంబంధించి కేంద్రం తన వాటాను కొనుగోలు చేయాలని, అలాగే పౌరసరఫరాల శాఖకు సంబంధించి గతంలో పెండింగ్‌లో ఉన్న నిధులతో పాటు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులపై కూడా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ దృష్టికి సీఎం తీసుకెళ్లారు. దేశంలో ధాన్యం సేకరణలో పంజాబ్ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో హర్యానా, మూడో స్థానంలో తెలంగాణ ఉంది. ఇన్ని లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా.. సన్న బియ్యానికి రూ.500 బోనస్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో కంటే కూడా ఈ ఏడాది ఎక్కువగా ధాన్యం సేకరణ జరిగింది. కాళేశ్వరం నుంచి నీళ్లు ఇవ్వకపోయిప్పటికీ లక్షల హెక్టార్లలో పంటను పండించి రూ.500 సబ్సీడీతో పంటను కొనుగోలు చేసింది. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉగాది నుంచి రేషన్ సరఫరా ద్వారా సన్న బియ్యాన్ని ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన నిధులను తెలంగాణకు వెంటనే మంజూరు చేయాల్సిందిగా కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఆ శాఖకు సంబంధించిన ఇతర అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం తొలిరోజు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్. దాదాపు దాదాపు గంట పాటు వీరి సమావేశం కొనసాగింది. తెలంగాణ రాష్ట్రంలో పలు నీటి ప్రాజెక్టులపై ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంగళవారం కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో భేటీ అయిన సీఎం రేవంత్, ఉత్తమ్.. సాయంత్రం ఢిల్లీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు రానున్నారు.

## బంగ్లాదేశ యూటర్న్.. భారత్ తో సంబంధం తప్ప వేరే దారి లేదంటూ ప్రకటన



ఢాకా,ఈమధ్య కాలంలో భారత్ తో బంగ్లాదేశ్ వైరం పెరిగిపోయింది. భారత్ కు వ్యతిరేకంగా పాక్, చైనాలతో సంబధాల కోసం పాకులాడిన ఆ దేశ ప్రభుత్వ సలహాదారుడు మమ్మద్ యూనస్ సడెన్ గా యూటర్న్ తీసుకున్నారు. భారత్ తో సంబంధాలు మాకు అవసర అంటూ చిలకపలుకులు పలుకుతున్నారు. మహ్మద్ యూనస్ ... ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రాన సలహాదారుడు. మొత్తం ప్రభుత్వాన్ని ఈయనే రన్ చేస్తున్నాడు. అయితే యూనస్ వచ్చిన దగ్గర నుంచీ ఇష్టమొచ్చినట్టు నిర్ణయాలు తీసుకుంటూ భారత్ తో గొడవలు పడుతూనే ఉన్నారు. బంగ్లాలో భారతీయులను అవమానించడం, అక్కడ హిందువులపై దాడులు జరుగుతున్నా చూస్తూ ఊరుకున్నారు. అంతేకాదు ఇండియా ఎడ్డెం ఆయన తెడ్డెం అంటూ ప్రవర్తించారు. షేక్ హసినాను అప్పగించాలంటూ తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. అక్కడితో ఆగకుండా చైనాతో చేతులు కలిపి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అయితే ఇప్పుడు ఏం జరిగిందో ఏంటో సడెన్ గా మాట మార్చారు యూనస్.

### మాకు వేరే దారి లేదు..

ఇంకో నెలరోజుల్లో ఏప్రిల్ 3-4 తేదీలలో థాయిలాండ్‌లో %దీ×మీుజుజ% శిఖరాగ్ర సమావేశం జరగనుంది. కరెక్ట్ గా దీని ముందు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మొహమ్మద్ యూనస్...బాతర్ తో మంచి సంబంధాలు తప్ప మాకు వేరే దారి లేదు అంటూ ప్రకటించారు. నెండు దేశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని అందుకే ఇది తప్ప వేరే మార్గం లేదని చెప్పారు. గత కొంతకాలంగా కొన్ని ప్రచారాలు ఇరు దేశాల మధ్యా వైరాన్ని సృష్టించాయని కూడా అన్నారు. దానిని రూపుమాపడానికి, తమపై ఉన్న అపార్థాలను తొలగించుకోవడానికి ప్రయత్నిస్తున్నామని యూనస్ తెలిపారు. ఇప్పటికీ భారత్, బంగ్లా మధ్య సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పుకొచ్చారు. రెండు దేశాలు చారిత్రక, రాజకీయ మరియు ఆర్థిక దృక్కోణం నుండి చాలా దగ్గరగా ఉన్నాయి...అందువల్ల మేము ఎప్పటికీ ఒంటరిగా ఉండలేమని చెప్పుకొచ్చారు యూనస్. ప్రస్తుతం ఉన్న అపార్థాలు భవిష్యత్తులో తొలగిపోయి...ఇంతకు ముందులా ఉంటామని అన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్,మార్చి4: ఇంటర్మీడియట్ పరీక్షలు నేటినుంచి(బుధవారం) ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులకు మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆత్మసైర్థ్యంతో పరీక్షలు రాయాలని సూచించారు.

ఎటువంటి టెన్షన్‌కు లోనుకాకుండా అధికారులు నిర్దేశించిన సమయానికి అర్థగంట ముందుగానే పరీక్షా హాల్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తగిన ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా ఉంటూ మీ వంతు కృషి చేయండి అని కేటీఆర్ సూచించారు. మీ కష్టానికి తప్పకుండా అద్భుతమైన ఫలితాలు వస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇంటర్ వార్షిక పరీక్షలకు ఉదయం 8:45 గంటలలోపు వస్తేనే అనుమతిస్తామన్న నిబంధన పెట్టినా.. 9:05 గంటల వరకు వచ్చిన విద్యార్థులను సైతం పరీక్షకు అనుమతించనున్నట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఈ సారి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా పరీక్షకు అనుమతిస్తామని పేర్కొన్నారు. అయితే ఉదయం 8:45 గంటల వరకు వచ్చిన వారిని మాత్రమే అనుమతిస్తామని హాల్‌టికెట్లపై ముద్రించిన మాట వాస్తవమేనని, విద్యార్థులు త్వరగా పరీక్షాకేంద్రాలకు వస్తే టెన్షన్‌కు గురవకుండా పరీక్షరాస్తారన్న ఆలోచనతో అలా ముద్రించామని తెలిపారు.

## ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి...




సిరిసిల్ల: సాగునీరు లేక ఎండిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యడిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల క్లబ్ ప్రెస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీరు అందక పంటలు ఎండిపో తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, కేటీఆర్‌ను విమర్శించడం లక్ష్యంగా కేకే మహేందర్ రెడ్డి, ఆది శ్రీనివాస్ పనిచేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే వ్యవసాయాన్ని దండగలా మార్చి ఉంది. ఎల్లారెడ్డిపేట మండలంలో 425 ఎకరాల్లో పంట ఎండిపోయిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది నడుస్తున్న గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉపాధి లేక ప్రజలు ఇప్పటికే అనేక అవస్థలు పడుతున్నారు. రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన మహేందర్ రెడ్డి వీలైతే సిరిసిల్ల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.రైతుల పక్షాన నిలిచిన కేటీఆర్, సాగునీటి విడుదలకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంపాదకీయం

బుధవారం 05-03-2025

# ఆందోళనే అసలు 'పరీక్ష'

విద్యార్థులకు పరీక్షలు అనగానే ఆందోళన చెందడం మానసిక ఒత్తిడికి, మానసిక ఆందోళనకు గురికావడం చేస్తుంటారు. అనేక మంది విద్యార్థులకు జ్వరం రావడం, కొంత మంది విద్యార్థులకు నీరసంగా ఉండటం, మరికొంత మంది విద్యార్థులకు తల తిరగడం, వాంతులు చేసుకోవడం చేస్తున్నారు. మానసిక శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు, డాక్టర్లు విద్యార్థులకు పరీక్షల సమయంలో కనీసం 6 నుండి 7 గంటల వరకు నిద్ర అవసరమని అంటున్నారు. ఎంత ప్రతిభ కలిగిన విద్యార్థులైనా నిద్ర లేమి వల్ల చదివింది మరచిపోవడం, చదివినది జ్ఞాపకం రాక సమయం వృథా కావడం జరుగుతుంది. పరీక్ష హాల్ లో నిద్రపోవడం లాంటివి జరుగుతుంటాయి. పరీక్షలోని ఇన్విజిలేటర్ పేపర్ ఇవ్వగానే గబగబా రాయకుండా మొత్తం ఒకసారి ప్రశాంతంగా చదవాలి. ప్రశ్నాపత్రం చేతికిరాగానే ముందు మంచిగా వచ్చిన ప్రశ్నలను టిక్కు పెట్టుకోవాలి, తర్వాత మిగిలిన ప్రశ్నలను రాయాలి. ఈ విధంగా ప్రశ్నలు పూర్తి చేయాలి. 20 మార్కుల కోసం అర్ధగంట ముందు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రం ఇస్తారు. అబ్జెక్టివ్ ప్రశ్నాపత్రం ఇవ్వగానే మెయిన్ పేపర్‌కు కట్టి రాయాలి. చివరి నిమిషంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నాపత్రాన్ని కట్టకపోవడం వలన కంగారు ఎక్కువవుతుంది. అసలు పేపర్లు కిందికి మీదకు అవుతాయి. తల్లిదండ్రులు విద్యార్థులకు మార్కులు, ర్యాంకులు అంటూ మానసిక ఒత్తిడికి గురి చేయరాదు. కొంతమంది తల్లిదండ్రులకు తమ పిల్లలను వేరే పిల్లలతో పోల్చడం సరికాదు. విద్యార్థులు ఆత్మన్యూనతా భావం కలుగుతుంది. చివరి నిమిషంవరకు చదవడం శ్రేయస్కరం కాదు. కొంత మంది విద్యార్థులు బస్సులలో వెళ్తూ, ఆటోలలో వెళ్తూ, స్కూటర్ మీద వెళ్తూ చదువుతూనే ఉంటారు. పరీక్షహాల్‌లో వెళ్లే నిమిషం ముందు వరకు చదువుతూ ఆందోళన పడుతుంటారు. పరీక్షకు వెళ్ళే అర్ధగంట ముందు చదవడం పూర్తిగా ఆపివేసి ప్రశాంతంగా ఉండాలి. పరీక్షలకు ఏమేమి తీసుకెళ్ళాలి. పదవ తరగతి, ఇంటర్మీడియట్, పోటీ పరీక్షలు దేనికైనా వెళ్లేముందు హాల్‌టికెట్ తప్పకుండా తీసుకొనిపోవాలి. రెండు పెన్నులు, మంచినీటి బాటల్, దస్తీ (చిన్న టవల్ లాంటిది) తీసుకొనిపోవాలి. పరీక్ష సమయం కంటే అర్ధగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవడం మంచిది. పరీక్ష కేంద్రంలో ప్రశాంతంగా ఉండాలి. ప్రశ్నతీరును బట్టి జవాబులు రాయాలి. ప్రశ్నల మార్కు లకు తగినట్లు సమాధానం ఉండాలి. కేవలం ఒకే ప్రశ్నను పట్టుకొని సమయం వృథా చేయకుండా ఏ ప్రశ్నకు ఎన్ని మార్కులు కేటాయించారు ఎంత సమయం కేటాయించుకోవాలి అనేది ప్రణాళికలు రూపొందించుకోవాలి. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్య అనేది విద్యార్థులకు భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలు. పరీక్షలముందు ఎలా చదవాలి అనే ప్రశ్న అనేక మందిని వేధిస్తుంటుంది. ఇప్పటికే దాదాపు అన్ని పాఠాలను పూర్తి చేసుకొని పరీక్షలకు సిద్ధం అయి ఉంటారు. దాదాపు అకాడమిక్ పరీక్షలలో గత ఐదు, ఆరు సంవత్సరాల నుండి వచ్చిన ప్రశ్నలు మళ్ళీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గతంలో జరిగిన పరీక్ష పేపర్లు ఒక్కసారి క్షుణ్ణంగా చదవాలి. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎక్కువగా చేసే తప్పు ఏమిటంటే ప్రశ్నలను సరిగ్గా చదవకపోవడం, చదివినా అర్థం చేసుకోవడంలో తొందరపాటు, ఆత్రుత వలన తెలిసిన విషయాలను కూడా తప్పుగా జవాబులు రాసే అవకాశం ఉంది. వివరించండి? సమర్థించండి, విశదీకరించండి, మీరు ఏకీభవిస్తారా? విభేదిస్తారా? అంటూ రకరకాలుగా అడిగే అవకాశం ఉంది. సమయం అనేది కూడా చాలా ముఖ్యం. చిన్న ప్రశ్నలకు సంక్షిప్తంగా, వ్యాసరూప ప్రశ్నలకు పెద్దగా జవాబులు రాయాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో వ్యాకరణం, ఉత్తరాలు రాసే విధానం తెలుసుకోవాలి. గణితంలో చాలా మంది బెంబేలెత్తిపోతారు. ప్రణాళిక ప్రకారం ప్రతి రోజు ఐదు, ఆరు చిన్న లెక్కలు, ఐదు, ఆరు పెద్ద లెక్కలను చేస్తుండడంతో పరీక్షల సమయంలో ఒత్తిడిని తగ్గించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. భౌతిక, రసాయన, బయోలజీ సబ్జెక్టలలో ఎక్కువగా ఫార్ములాలు, ఈక్వేషన్స్, డయాగ్రామ్స్, రియాక్షన్ ప్రత్యేకంగా నోట్స్ రాసుకొని చదివితే మంచి మార్కులు సాధించడానికి అవకాశాలు ఉంటాయి. సాంఘిక శాస్త్రం లో భారత దేశం, ప్రపంచపటం, తేదీలు, సంఘటనలు, సమకాలీన అంశాలతో ముడిపెట్టి చదవడం, కథల మాదిరిగా చదివితే మంచి మార్కులు సాధించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కష్టపడి చదివే కన్నా ఇష్టపడి చదివితే ఏ సబ్జెక్టైన సులభంగా కనిపిస్తుంది.

# ఎన్నికల సంఘం విశ్వసనీయతపై నీలినీడలు !




హైదరాబాద్,ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసుకోగలం. నేటికీ పటిష్ట మైన విధానాలు లేదా, విదులు లేకుండా పోయాయి. ఇసి అండతో బోగస్ ఓట్లు సృష్టించారని ఇటీవల బెంగాల్ సిఎం మమతా బెనర్జీ పదేపదే ఆరోపిస్తున్నారు. అయితే దీనిపై ఇసి కూడా పెద్దగా స్పందించలేదు. పటిష్టమైన ఓటు నమోద్ కార్యక్రమం జరగడం లేదు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్లు పక్కాగా ఉంటున్నా, ఓటర్ కార్డు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఇకపోతే ఎన్నికల వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం లేదని చెప్పుకుంటున్నా..అది పెద్దగా ప్రభావం చూపే అంశం కాదు. ఎందుకంటే ఎన్నికల కమిషన్ మొత్తం కేంద్రం కనుసన్నల్లోనే సాగుతోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, బిజెపి అధికారుంలో ఉన్నా అదే జరుగుతోంది. ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషన్ నియామకం చూస్తే విషయం మరోమారు అర్థం చేసుకో వచ్చు. నిజానికి అప్పుడప్పుడూ సుప్రీంకోర్టు జోక్యం ద్వారా మనదేశ ప్రజాస్వామ్యం బలపడుతోంది. నిరంకుశ పాలకుల కబంధ హస్తాల్లోంచి వ్యవస్థలను రక్షించుకునే అవకాశం వస్తోంది. అయితే సుప్రీం తీర్పులను కూడా కాలరాస్తున్నాం. కోర్టులు,ధర్మాసనాలు ఇచ్చే తీర్పులను బేఖాతర్ చేస్తున్నాం. ఎన్నికల సంఘం నియామకాలపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం రెండేళ్ల క్రితం ఇచ్చిన ఆదేశాలు మోడీ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించకపోవడం, ఎన్నికలను సజావుగా నిర్వహించక పోవడం వంటి ఆరోపణలను ఇసి ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం రెండేళ్ల క్రితం ఇచ్చిన తీర్పు మేల్కొలుపు లాంటిది. ఏకపక్షంగా తమ ఇష్టంవచ్చిన వారిని ఎన్నికల కమిషనర్లుగా నియమించడం, వారు మోడీ కనుసన్నల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు,ఎన్నికల కమిషనర్ల నియామకాలపై సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువ రించింది. ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్షనేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉన్న త్రిసభ్య కమిటీయే ఎన్నికల సంఘంలో నియామకాలను చేపట్టాలని స్పష్టం ఆదేశాలు ఇచ్చింది. అదే విధంగా నిరంకుశంగా వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న పాలకులకు వార్నింగ్ లాంటిదని అంతా అనుకున్నారు. శక్తివంతమైన తుపాకీ కన్నా ఓటు చాలా శక్తివంత మైనదని ధర్మాసనం తన తీర్పులో పేర్కొన్నారు. బలహీనంగా ఉన్న వ్యక్తిని ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కూడా ఆనాడు ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశంలోని చట్టసభలకు ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన ఎన్నికల సంఘం నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. కొన్ని లోపాలు, లొసుగులు వున్నప్పటికీ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించటంలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను నిరూపించుకోవాలి. అయితే ఈ తీర్పును మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా కేరళ కేడర్‌కు చెందిన ఐఎఎస్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాల్సిన కమిటీని కేంద్రం పట్టించుకోలేదు. దీనిపై మరోమారు సుప్రీంలో కేసు నడుస్తోంది. ఇది తేలాల్సి ఉంది. ఈలోగా రాజీవ్ కుమాన్ పదవీకాలం ముగియడంతో ఎంపిక అనివార్యం అయ్యింది. అయితే వ్యవస్థలను భ్రష్టు పట్టించడం అన్నది కాంగ్రెస్ జమానా నుంచే ప్రారంభం అయ్యింది. దేశాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన కాంగ్రెస్, తదుపరి పాలకులకు బాటలు వేసింది. అయితే ఇటీవలి కాలంలో ఎన్నికల నిర్వహణలో కమిషన్ వ్యవహరిస్తున్న తీరు పలు ప్రశ్నలకు తావిస్తోంది. బరిలో నిలిచిన అన్ని పార్టీల మధ్య సమతుల్యత పాటిస్తూ ఎన్నికల్లో ధన బలం వినియోగాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన కమిషన్ తన కర్తవ్య నిర్వహణలో విఫలం కావడం క్షంతవ్యం కాదు. సుప్రీం ఆదేశాల మేరకు కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమించాలన్న ఆదేశాలతో పటిష్ట ఎన్నికల సంఘం నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రాలేదు. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చన తీర్పు వ్యవస్థలను కాలరాస్తున్న వారికి గుణపాఠం కావాలి. అది బిజెపి కావచ్చు..లేదా ఇతర ప్రాంతీయ పార్టీలు కావచ్చు..ఇదో హెచ్చరికగా గుర్తించాలి. సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం కొలీజియం వంటి వ్యవస్థను రూపొందించాలన్న సూచనను స్వాగతించాల్సిందే. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత పారదర్శకంగా ఉండాలి. పారదర్శకత లేకపోతే వినాశకర పరిణామాలకు దారితీస్తుంది. ఎన్నికల కమిషన్ న్యాయబద్ధంగా, నిజాయితీగా వ్యవహరించాల్సి ఉంది. నిజానికి ఇసి తీరు ఈ మధ్య దిగజారిందన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నికల్లో పెరుగుతున్న ధనబలం, నేరపూరిత రాజకీయాలు వంటి అంశాలపై కఠినంగా వ్యవహరించలేక పోతున్నది. అధికారంలో ఉన్న పార్టీ అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండేందుకు ఎన్నికల కమిషన్‌ను ఒక పావుగా వాడుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంది. ఇసి స్వతంత్రంగా ఎన్నికల నిర్వహణ అన్నది కేవలం శేషన్ హయాంలో మాత్రమే జరిగింది. ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించేలా ఎన్నికల పక్రియ స్వచ్ఛతను కాపాడుకోవాల్సిన అవసరముంది. సిబిఐ అధిపతి, లోక్‌పాల్ నియామకాల తరహాలోనే సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకం జరగాలి. పలు సందర్భాల్లో లక్షల వరకు ఓట్లు గల్లంతు అయినట్లుగా ఆరోపణలు వచ్చాయి. అనేకసార్లు అక్రమాలు, అవకతవకలు బయటపడ్డాయి. ఎన్నికల కమిషన్‌ను పూర్తి స్థాయిలో సంస్కరించి దాని సమగ్రతను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వం, అధికార పార్టీ ప్రభావం పడకుండా రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవడం అవసరం. దీనితో పాటు పదవీ విరమణ చేసిన ఎన్నికల కమిషనర్లు తరువాత ప్రభుత్వ పదవుల్లో అంటే గవర్నర్లుగానో, చట్టసభల సభ్యులుగానో నియమితులు కావటాన్ని కూడా నిషేధించాలి. ఇసి నిష్పక్షపాతంగా వ్యవహరించే విధంగా చట్టాన్ని పటిష్టంగా, మరింత పారదర్శకంగా రూపొందించుకోవాలి. ఓటరు కార్డు ఉన్నా ఓట్లు గల్లంతవుతున్న తీరుకు అడ్డుకట్టు పడాలి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ప్రజలు కూడా స్వేచ్ఛగా తాము కోరుకున్న పార్టీకే ఓటేస్తారు. సరైన వ్యక్తులను ఎన్నుకుంటారు.

# ఇదా అగ్రరాజ్య పెద్దరికం?



వాషింగ్టన్,రష్యా భూతాన్ని చూపించి భయపెట్టి ఉక్రెయిన్ మెడలు వంచి అక్కడి ఖనిజసంపదను కొల్లగొట్టడానికి శాంతి చర్చల ముసుగులో అమెరికా చేసిన తొలి విడత భేటీ చివరకు బెడిసికొట్టింది. శాంతియుత దౌత్య చర్చలకు వేదికగా నిలిచే ఓవల్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు ఒక్కసారి ఉలికిపాటు కలిగించాయి. భేటీలో మొదట కొంతసేపు సామరస్యంగా సాగినా, భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని జెలెన్ స్కీ ఒత్తిడి చేయడం అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నచ్చలేదు. వారి దృష్టిలో పుతిన్ నియంతకాదని, జెలెన్‌స్కీయే నియంత అన్న అభిప్రాయం నాటుకుంది. తరువాత శాంతి చర్చలకు సంబంధించి తాము చేసిన ప్రతిపాదనలను అంగీకరించాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ డిమాండ్ చేసిన తరువాతనే చర్చలు వేడెక్కడం ప్రారంభించాయి. భేటీ మొదట్లో ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరా కొనసాగిస్తామని, అయితే ఆయుధాల సరఫరా కన్నా యుద్ధాన్ని ముగింప చేయడానికి, ఇతర అంశాలపై దృష్టి కేంద్రీకరించడానికే ప్రయత్నిస్తున్నామని ట్రంప్ వెల్లడించినా భేటీ బెడిసికొట్టిన తరువాత ఆ ఆలోచనలు మారుతున్నట్టు కనిపిస్తోంది. ఉక్రెయిన్ అస్తిత్వానికి భంగం కలిగించే అమెరికా ఆంక్షలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఎక్కడా రాజీపడలేదు. ఓవెల్ ఆఫీసులో అమెరికా అధ్యక్షుడు, మరో దేశాధ్యక్షుడి మధ్య జరిగిన అతిపెద్ద వాగ్వాదం ఇదే కావడం విశేషం. ఈ చర్చల తీరు పరిశీలిస్తే ఉక్రెయిన్, రష్యాల మధ్య వైరాన్ని మాపడానికి మధ్యవర్తిత్వం వహించే అగ్రరాజ్యం ఏకపక్షంగా రష్యాకే వత్తాసు పలుకుతూ ఉక్రెయిన్‌ను బెదిరించడం, హెచ్చరించడం కనిపించింది. అయితే ట్రంప్ హెచ్చరికలకు ఏమాత్రం బెదరకుండా జెలెన్ స్కీ గట్టిగానే సమాధానం ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఓ హంతకుడని, ఆయనతో రాజీపడే ప్రసక్తే లేదని జెలెన్ స్కీ నిర్భయంగా చెప్పారు.అయితే జెలెన్ స్కీ వాదనకు అవకాశం సరిగ్గా ఇవ్వలేదు. ఆయనపై ఎదురు దాడి కనిపించింది. ఉక్రెయిన్‌కు అమెరికా చేసిన సాయానికి కూడా కృతజ్ఞతలు చెప్పడం లేదని జెలెన్ స్కీపై అమెరికా నేతలు ఆక్షేపించారు. వాస్తవాలను పరిశీలిస్తే 2022 నుంచి రష్యాతో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ అమెరికా తమకు సాయం చేస్తున్నందుకు కనీసం 33 సార్లయినా అమెరికాకు, ఇదివరకటి అధ్యక్షుడు జో బైడెన్‌కు కృతజ్ఞతలు తెలిపిన సంఘటనలు ఉన్నాయి. అవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా ట్రంప్ ప్రభుత్వం ఏదో ఒకసాకు చూపించి జెలెన్ స్కీని అవమానించడమే అన్నట్టు ఈ భేటీ సాగింది. భేటీ నుంచి మధ్యలోనే జెలెన్ స్కీ బయటకు వెళ్లిపోయారు.అర్థాంతరంగా భేటీ ముగిసాక జెలెన్ స్కీ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్‌నకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్, పుతిన్ మధ్య సంబంధం పైనా జెలెన్ స్కీ స్పందిస్తూ ట్రంప్ తటస్థంగా ఉండాలని, తమ వైపే ఉండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. అమెరికా సాయం లేనిదే రష్యా సైన్యాలను ఢీకొనడం సాధ్యం కాదన్న అభిప్రాయంతో ఉన్నారు. కానీ ట్రంప్ మాత్రం జెలెన్ స్కీపై వ్యతిరేక భావంతోనే ఉన్నారు. శాంతి చర్చలకు జెలెన్ స్కీ తిరిగి వచ్చినప్పటికీ అందుకు తాను సిద్ధంగా లేనని, పైగా జెలెన్ స్కీ శాంతిని కోరుకోకుండా మరేదో ఆశిస్తున్నారని ట్రంప్ తెలిపారు. ఈ భేటీ అర్థాంతరంగా ముగిసిపోవడాన్ని రష్యా ఎద్దేవా చేసింది. అమెరికా పట్ల అమర్యాదగా ఉన్న ఉక్రెయిన్‌కు ఈ పరిణామం గట్టిదెబ్బ అని, జెలెన్ స్కీకి ఇలా జరగాల్సిందే అని దుయ్యబట్టింది. శుక్రవారం నాటి భేటీ తరువాత ఐరోపా దేశాల్లో ప్రకంపనలు కనిపించాయి. ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తదితర ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు తమ అండదండలను పునరుద్ఘాటించాయి. ఐరోపా దేశాలకు, అమెరికాకు మధ్య కొనసాగుతున్న అట్లాంటిక్ కూటమి విషయంలో అమెరికా రష్యా మైత్రి వల్ల వివాదాస్పద పరిస్థితి ఏర్పడవచ్చని, అందుకనే ఐరోపా దేశాలన్నీ ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే విషయంలో సమైక్యంగా, పటిష్టంగా ఉండాలని ఐరోపా యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కజా కల్లాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పుడు స్వేచ్ఛా ప్రపంచానికి కొత్త నాయకత్వం అవసరమని ఆమె పిలుపునిచ్చారు. ఐరోపా యూనియన్ దీన్ని ఒక సవాలుగా తీసుకోవాలని హెచ్చరించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో భవితవ్యంపై చర్చించడానికి లండన్‌లో ఐరోపా దేశాల నాయకులు సమావేశం అవుతున్నారు. ఇదే విధంగా ప్రత్యేక ఐరోపా సదస్సు కూడా మార్చి 6న యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా నేతృత్వంలో ఏర్పాటవుతోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి భరోసా ఇస్తూ యూరోపియన్ నేతలు సందేశాలు పంపిస్తున్నారు.'మీరు ఒంటరివారు కాదు, మీ వెంట మేం ఉన్నాం' అని పోలేండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ వెల్లడించారు. జర్మనీ, ఇటలీ, స్వీడన్, న్యూజిల్యాండ్ ఈ విధంగా ఐరోపా దేశాలన్నీ తమ ఎక్స్ ద్వారా సందేశాలు పంపించడం విశేషం. దీనికి జెలెన్ స్కీ స్పందిస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా బైడెన్ ప్రభుత్వ కాలంలో ఉక్రెయిన్‌కు బిలియన్ల డాలర్ల కొద్దీ ఆర్థికసాయం అందించడానికి, అలాగే నౌకల ద్వారా ఆయుధాలను సరఫరా చేయడానికి తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు రద్దయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఉక్రెయిన్ రాజకీయ విశ్లేషకులు వొలొడిమీర్ ఫెసెంకో తన అభిప్రాయం వెల్లడించడం గమనార్హం.

## చికెన్ మేళాకు ఎగబడ్డ జనం

రాజమండ్రి,బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లో అపోహలను తొలగించేందుకు రాజమండ్రిలో చికెన్ మేళాకు అనుహ్య స్పందన లభించింది. చికెన్ వంటకాలను తినడానికి నాన్ వెజ్ ప్రియులు క్యూ కట్టారు. మేళాలో వివిధ రకాల చికెన్ వంటకాలను ఏర్పాటు చేశారు. చికెన్ వంటకాలను ఆరగించడానికి నాన్ వెజ్ ప్రియులు ఎగబడ్డారు. చికెన్ హోల్ సేల్ అండ్ రిటైల్ వర్తక సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రి ఆజాద్ చౌక్ సెంటర్లో ఈ చికెన్ మేళాను ఏర్పాటు చేశారు. చికెన్ 100 డిగ్రీల వేడిలో ఉడికించి తినడం వల్ల బర్డ్ ఫ్లూ మనిషికి వచ్చే అవకాశం లేదని తెలియజెప్పడానికి ఈ మేళా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్, గుడ్డు అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపిందని నిర్వాహకులు ఆవేదన చెందారు.

## నష్టాలను పూడ్చుకునే యత్నం

ముంబై,ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునేందుకు సిద్ధమవుతోంది. నష్టాలను పూడ్చుకునేందుకు కాంట్రాక్టు ఉద్యోగులతో కలిపి సుమారు 1,000 మంది వరకు సిబ్బందికి లేఆఫ్ ఇవ్వాలని ప్రణాళికలు వేస్తోందని 'బ్లూమ్‌బెర్గ్' తన కథనంలో పేర్కొంది. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సహా పలు విభాగాల్లో ఈ కోత ఉండనున్నట్లు సమాచారం. ఐదు నెలల వ్యవధిలో ఓలా (క్షిజీ) నుంచి ఇలాంటి వార్తలు రావడం ఇది రెండోసారి. గత నవంబర్‌లో 500 మంది సిబ్బందిని ఓలా ఎలక్ట్రిక్ తొలగించింది. ఇటీవల ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో ఓలా ఎలక్ట్రిక్ రూ.564 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. గతేడాది ఇదే త్రైమాసికంలో ప్రకటించిన రూ.376 కోట్ల నష్టంతో పోలిస్తే నష్టాలు మరింత పెరగడం గమనార్హం. పెరిగిన పోటీ కారణంగా ఆదాయాలు తగ్గుముఖం పట్టడం, సేవా లోపాలను సరిదిద్దేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయడం వంటివి ఇందుకు కారణమయ్యాయి. అలాగే నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా 800గా ఉన్న స్టోర్ల సంఖ్యను ఓలా ఎలక్ట్రిక్ 4 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. విద్యుత్ వాహన విభాగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌పై ఇటీవల కాలంలో ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విక్రయానంతర సేవల విషయంలో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 10వేలకు పైనే ఫిర్యాదులు రావడం, దీనిపై సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ విచారణకు ఆదేశించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో స్టోర్లు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే లాభదాయకతలోకి వచ్చేందుకు కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కంపెనీ షేరు విలువ 52 వారాల కనిష్ఠానికి చేరింది. ఎన్ఎస్ఈలో షేరు విలువ 5 శాతం క్షీణించి రూ.54 వద్ద కదలాడుతోంది.

## అమరావతికథల సృష్టికర్త సత్యం శంకరమంచి జయంతి

గుంటూరు,అమరావతి కథల సృష్టికర్త ఆయిన సత్యం శంకరమంచి జయంతి మార్చి 3న జరుపుకుంటున్నాం. సత్యం శంకరమంచి పుట్టి ఇప్పటికి 88ఏళు ళ్ళ పూర్తయ్యాయి. కానీ, 50ఏళ్లకే ఆయనకు నూరేళ్లు నిండాయి. నూరేళ్లే కాదు,ఎన్నేళ్ళైనా నిండుగా నిలిచివుండే అజరామరమైన అమరావతి కథలు అపురూప శిల్పాలు అని ఎందరెందరో మహామహులు పొగడ్తల పొన్నచెట్లు నాటారు. ఈ కథా సంపుటిని 1979లో రాష్ట్ర సాహిత్య అకాడెమి పురస్కారం వరించింది. శ్యామ్ బెనెగల్ వంటి దిగ్ దర్శకుడు ఈ కథలను దృశ్యమానం చేశారు. దానితో, తర్వాత తరాలకు ఈ సంపద చేరింది. అల్పాక్షరాల అనల్పార్థ రచన అన్నాడు పాల్కురికి సోమనాథుడు. ఆ సూత్రాన్ని అక్షరాలా పాటించినవాడు సత్యం శంకరమంచి. ఒక్క పేజీ నిడివిలోనే అద్భుతమైన కథాకథన శిల్పాన్ని సృజియించి, తెలుగు సాహిత్యజలధిని ఆశ్చర్యంలో ముంచివేసిన ఆధునిక రచయితను తలచుకుందాం. గుంటూరు జిల్లా అమరావతి చాపాడులో మార్చి 3వ తేదీ, 1937లో శేషమ్మ, కుటుంబరావు దంపతులకు జన్మించాడు. 1987వ సంవత్సరం మే 21వ తేదీ నాడు, యాభైఏళ్ళ నడి వయస్సులోనే అమరపురికి వెళ్ళిపోయాడు. అన్నింటిలోకి తలమానికం అమరావతి కథలు. ఇది 100 కథల సంపుటి. ఏ కథ కూడా ఒక్క పేజీకి మించదు. ఆ చిన్న స్థలంలోనే అద్భుతమైన భవనం నిర్మించిన ఘనత ఆయన సొత్తు. అమరావతి అతనికి బాగా తెలిసిన ఊరు. గడిపిన ఊరు. గాలి పీల్చిన ఊరు. నీరు తాగిన నేల. ఎంతోమంది మనుషులను, మనసులను చూసిన ఊరు. ఆ మట్టి వాసన, ఆ జ్ఞాపకాల నుంచే కథలు అల్లాలని ఎప్పుడో సంకల్పం చేసుకున్నాడు. మస్తిష్కాన్నే పుస్తకంగా చేసుకొని, గుండె గుడిలో కొన్ని కథలు అల్లుకున్నాడు. పురాణం సుబ్రహ్మణ్యశర్మ పూనికతో, వాటిని గుండె నుంచి తీసి, అక్షరబద్ధం చేశాడు. అవి చరిత్ర సృష్టించాయి. ఇంతటి కథకుడు మన తెలుగువాడు కావడం మన భాగ్యం. ఈ కథలు చదివితే తెలుగుదనం, తెలుగు సంస్కృతి, తెలుగు భాష చేరువవుతాయి. ఇటువంటి వారి కృషి వల్ల తెలుగు ఎప్పటికీ దూరమవదనే విశ్వాసం పెరుగుతూనే ఉంటుంది.

## భగభగలే..

హైదరాబాద్,చలికాలం పోయి వేసవి మొదలైంది. ఈ వేసవి సీజన్‌లో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో అనేక ప్రాంతాలు నిప్పుల కొలిమిలా మారనున్నాయి. గత కొన్నేళ్లుగా వేసవిలో ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. ఈ ఏడాది కూడా తీవ్రత మరింత పెరగనుంది. అనేక ప్రాంతాల్లో ఫిబ్రవరిలోనే ఎండ మండిపోయింది. దక్షిణాదిలో పలుచోట్ల వడగాడ్పులు కొనసాగాయి. మూడు నెలలు అంటే... మార్చి నుంచి మే వరకూ ఎండ తీవ్రత క్రమేపీ పెరగనుంది. దేశంలో ఐదింట నాలుగొంతుల ప్రాంతం వడగాడ్పుల ప్రభావానికి గురికానుంది. దక్షిణాదిలో కొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతం, ఉత్తరాదిలో కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. మార్చి నుంచి మే వరకు మూడు నెలలకు సంబంధించి భారత వాతావరణ శాఖ అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది.

రాష్ట్రంలో అప్పుడే ఎండలు

రాష్ట్రంలో అప్పుడే ఎండలు పెరిగాయి. మార్చిలోనే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. గత నెల 24న నంద్యాల జిల్లా బండిఆత్మకూరులో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.6 డిగ్రీలు నమోదైంది. ఈ నెల నుంచే వేసవి ప్రభావం చూపుతూ, సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో భానుడు భగ్గుమనే అవకాశం ఉందని హెచ్చరించింది. గత వారం నుంచి రోజురోజుకీ 2-4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, రానున్న రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఫిబ్రవరి నెలలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఈ నెలలో సగటున గరిష్ఠ ఉష్ణోగ్రత 27.58 డిగ్రీలు కాగా.. 29.07 డిగ్రీలు (1.49 డిగ్రీలు ఎక్కువ) నమోదైంది. ఫిబ్రవరిలో వర్షపాతం సాధారణం కంటే 50 శాతం తగ్గింది. దీంతో భూమిలో, గాలిలో తేమశాతం తగ్గడం దేశంలో వేడి పెరగడానికి ఒక కారణంగా నిపుణులు చెబుతున్నారు.

ఎక్కువ రోజులు వడగాడ్పులు..

వేసవి సీజన్‌లో ప్రధానంగా మార్చి నుంచి మే వరకూ అనేక ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. అయితే దక్షిణాదిలో తమిళనాడు, దానికి ఆనుకుని కోస్తా, రాయలసీమల్లోని కొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతం, ఉత్తరాదిలో హిమాలయాలకు ఆనుకుని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సగటు కంటే తక్కువ నమోదవుతాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎండలు ఎక్కువగానే ఉంటాయని, వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఏపీ, తెలంగాణాల్లోనూ గాలులు

మార్చి వరకూ చూస్తే దేశంలో ఎండలు పెరగడంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి.

# కాంగ్రెస్ హిందూవ్యతిరేక పార్టీ

న్యూఢిల్లీ,కుంభమేళా, అయోధ్య కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు హాజరు కాకపోవడంపై బీజేపీ మరోమారు విమర్శలు గుప్పించంది. బిజెపి, కాంగ్రెస్ మధ్య మరోసారి మాటల యుద్ధం నడుస్తోంది. ప్రధాని మోడీ గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్‌పై బీజేపీ మాటల దాడి చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గేలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించింది. 2024లో అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి వారు హాజరకాలేదు. 2025లో మహా కుంభమేళాకు కాంగ్రెస్ నాయకులు హాజరుకాలేదని.. వాళ్లంతా హిందూ వ్యతిరేకులని బీజేపీ ధ్వజమెత్తింది. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఫొటోలు పెట్టి విమర్శలు చేసింది.రాహుల్ గాంధీ కుటుంబం మొత్తం హిందూ మతాన్ని వ్యతిరేకిస్తుంది. వారు బాబర్ నిర్మించిన మసీదుకు మూడుసార్లు వెళ్లారు కానీ రాముడి ఆలయంలో శ్రీరాముని దర్శనం కోసం వెళ్లలేదు. రాహుల్ గాంధీ తరచుగా రాయ్‌బరేలికి వెళ్తారు. కానీ ఆయన ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా జరిగే ప్రదేశానికి వెళ్లలేకపోయారు. ఇది కేవలం 2 గంటల రెండు నిమిషాల 120 కి.మీ. దూరంలో ఉంది' అని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు ఇక హిందీ పోస్టులో బీజేపీ మరో విమర్శ చేసింది. 'శతాబ్దాల పోరాటం మరియు నిరీక్షణ తర్వాత అయోధ్యలో ఒక గొప్ప రామాలయం నిర్మించబడింది. మోడీ చేతుల మీదుగా జనవరి 22, 2024న రామ్‌లాలా ప్రాణ ప్రతిష్ట జరిగింది. కానీ ఆలయ నిర్మాణాన్ని ఎప్పుడూ వ్యతిరేకించే కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఆహ్వానం అందుకున్న తర్వాత కూడా వేడుకకు హాజరు కాలేదు. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును సంతృప్తి పరచుకోవడానికి హిందువుల మనోభావాలను ఎప్పుడూ దెబ్బతీస్తుంది' అని బీజేపీ పేర్కొంది. బీజేపీ విమర్శలను మల్లిఖార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఖండించారు. బీజేపీ వాదన ప్రకారం.. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి వంటి మిత్రపక్షాల నాయకులు కూడా కుంభమేళాకు హాజరుకాలేదు. వీళ్లను కూడా హిందూ వ్యతిరేకులుగా పరిగణించాలా.. అని బీజేపీని ప్రశ్నించారు.

# చంద్రబాబు పాలన టిడిపికా...ప్రజలకా

అమరావతి,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం టీడీపీ నేతల కోసం పనిచేస్తారా?.. లేదా ప్రజలందరి కోసం పనిచేస్తారా? అని వైసీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నించారు. తన కొడుకును సీఎం చేసుకోవటానికి నారా లోకేష్ నియోజకవర్గానికి నిధులు మళ్లిస్తున్నారన్నారని, ప్రశ్నించిన వైసీపీ నాయకులపై అక్రమ కేసులుపెట్టి జైళ్లకు పంపిస్తున్నారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కు నిధులు కేటాయింపులు చేయకుండా మంత్రి నిమ్మల మాటలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు కాదు.. విషం చిమ్మే నాయకుడు అన్నట్లుగా చిత్తూరు పర్యటనలో మాట్లాడారని ఎమ్మెల్యే తాటిపర్తి పేర్కొన్నారు. అమరావతిలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ? 'చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు అని టీడీపీ నేతలు డబ్బా కొడతారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు కాదు.. విషం చిమ్మే నాయకుడు అన్నట్లుగా చిత్తూరు పర్యటనలో మాట్లాడారు. ఇంత ద్వేషాన్ని కడుపులో పెట్టుకొని బాబు రాజ్యాంగబద్ధంగా పరిపాలన చేస్తారా?. నేను రాజకీయాలు మాత్రమే చేస్తా.. సుపరిపాలన కాదు అన్నట్లుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. హోంమంత్రి మేము అనుకుంటే వైసీపీ నేతలు రోడ్ల మీద తిరగలేరు అన్నట్లుగా మాట్లాడుతారు. రాగ ద్వేషాలతో సీఎం, హోంమంత్రి మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి కేవలం టీడీపీ నేతల కోసం పనిచేస్తారా? లేక ప్రజలందరి కోసం పనిచేస్తారా అని ప్రశ్నించారు. 'తన కొడుకును సీఎం చేసుకోవటానికి నారా లోకేష్ నియోజకవర్గానికి సీఎం నిధులు మళ్లిస్తున్నారు. ప్రశ్నించిన వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారు. గత వైసీపీ హయంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ వైస్ జగన్ పథకాలు అందించారు. ఈ వ్యాఖ్యలపై చంద్రబాబు క్షమాపణ చెప్పాలి.. లేకుంటే రాజీనామా చేయాలి. చంద్రబాబు వ్యాఖ్యలపై గవర్నర్ స్పందించాలి. వెలిగొండ ప్రాజెక్టుపై నిజాలు మాట్లాడే దమ్ము మీకుందా అని అన్నారు. మంత్రి నిమ్మల వెలిగొండ ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కు నిధులు కేటాయింపులు చేయకుండా మాటలతో సరిపెడుతున్నారు. వెలిగొండ కోసం త్వరలో పాదయాత్ర చేస్తా' అని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు.

# మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పాత్ర శూన్యం

హైదరాబాద్,మహిళలకు ఇచ్చిన హామీల సాధనకై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం రేవంత్ మాటలు ఉత్తవేనని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.2500 వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లలో లక్ష కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ వట్టిదేనని చెప్పారు.జాగృతి మహిళా కార్యకర్తల నుంచి సేకరించిన 10 వేల పోస్టుల కార్డులను సీఎం రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హామీల అమలుపై మార్చి 8న ప్రకటన చేయకపోతే 10 వేల మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామన్నారు. లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని చెప్పారు. మహిళల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని విమర్శించారు. ఆడబిడ్డల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తుచేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీలేదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. వరంగల్ విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవీ పేరు పెట్టాలడి డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాము కూడా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం ప్రకటనకు, ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్‌కు పోలిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్పా పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశంలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే కార్యక్రమాన్ని మొదలుపెడితే ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. మార్చి 8న ఈ పథకాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం అందంగా అబద్ధాలు చెబుతున్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఎగ్గొట్టిందని విమర్శించారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వడ్డీ రాయితీ బకాయిలు విడుదలతో పాటు రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలన్నారు. భర్త చనిపోయిన మహిళలకు కొత్తగా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలన ఉన్నప్పుడు వస్తున్న పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కొత్తగా పెన్షన్‌దారులను నమోదుచేయడం లేదన్నారు.

# లైన్ దాటితే ఔట్.. లేడీ బాస్ యాక్షన్ షురూ



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్‌గా వచ్చిన లేడీ బాస్ మీనాక్షీ నటరాజన్ ఎఫెక్ట్ అప్పుడే పార్టీపై క్లియర్‌గా కనిపిస్తోంది. కీలక సమావేశం ముగిసిన, గంటల వ్యవధిలోనే నేతలకు ఆమె అలర్ట్ సైరన్ పంపిచారు.. ఒక వికెట్ పడగొట్టి, లైన్ దాటితే ఔట్ అన్న వార్నింగ్ ఇచ్చారు. పార్టీపై తిరుగుబాటు వాయిస్ వినిపిస్తున్న తీన్మార్ మల్లన్నపై చర్యలతో తన స్టైల్ ఎలా ఉంటుందో చూపించారు. ఆ క్రమంలో ఇప్పటి వరకు ఒకలెక్క.. ఇక నుంచి మరోలెక్క.. పార్టీకి మంచి రోజులు వచ్చాయని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడే నేతల నోటికి ఇక తాళాలు పడతాయని కాంగ్రెస్ శ్రేణులు హ్యాపీ అవుతున్నాయంట.

చార్జ్ తీసుకోగానే యాక్షన్ మొదలుపెట్టిన మీనాక్షి నటరాజన్

లేడీ బాస్ వచ్చారు. యాక్షన్ షురూ చేశారు. అని తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు చర్చించుకుంటూ తెగ ఆనందపడిపోతున్నాయి. పాత ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ కంటే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్‌గా వచ్చిన మీనాక్షి నటరాజన్ చాలా జూనియర్ .. కానీ అమె ఆలోచనలు, నిర్ణయాల ముందు ఆమెకు ఎవరు సాటి రారు.. గురి పెట్టారా గోలి దిగాల్సిందే అన్నట్లు ఉంటుందంట వ్యవహారం. అయితే అక్కడ హంగు ఆర్భాటం ఉండదు.. కేవలం పని మాత్రమే.

వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించిన తీన్మార్ మల్లన్న

మీనాక్షి నటరాజన్ సాదా సీదాగా ఉంటారు. హంగు ఆర్భాటాలంటే చిరాకు.. గాంధేయవాది, ఐడియాలజికల్‌గా పవర్ ఫుల్ ఉమెన్.. తేడాలు వస్తే, తాట తీసుడే.. పార్టీకి లాయల్టీగా ఉండాలంటారు, గీత దాటి ప్రవర్తిస్తే వేటు పడ్డుతుం దని చేతల్లో చూపిస్తారు. కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డే ఆఖరి రెడ్డి సామాజికవర్గానికి చెందిన ముఖ్యమంత్రని.. వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.

కులగణనపై రాహుల్ ఆలోచనలను ఆచరణలో పెట్టిన రేవంత్

అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన పై అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆలోచనలను రేవంత్ రెడ్డి ఆచరణలో పెట్టారు. రాష్ట్రంలో కులగణన నిర్వహింపచేసిన ముఖ్యమంత్రి అందరి దృష్టి తనవైపు తిప్పుకున్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయంగా దెబ్బకొట్టేందుకు కులగణన పై తప్పుడు ప్రచారం చేస్తుంటే కాంగ్రెస్ నేతలు సమర్ధంగా తిప్పికొడుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ భీఫామ్‌తో ఎమ్మెల్సీగా గెలిచిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న కులగణన రిపోర్టు ను చించి, నిప్పు పెట్టి కొత్త కాంట్రవర్సీకి కారణం అయ్యారు. బీసీలు తెలంగాణ ఓనర్లని.. రాష్ట్ర జనాభాలో పిరికెడు మందిలేని వారిలో 60మంది ఎమ్మెల్యేలుగా ఉన్నారని.. రెడ్లు, వెలమలు అసలు తెలంగాణ వారే కాదని చిత్రమైన స్టేట్‌మెంట్ ఇచ్చారు.

తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

కాంగ్రెస్ పార్టీ నేతగా ప్రభుత్వం నిర్ణయాన్ని తప్పుబట్టడంతో ఆ పార్టీ నేతలే మల్లన్న పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ వాదాన్ని వినిపించడంలో తప్పులేదు కాని.. దాన్ని తీన్మార్ మల్లన్న ఎక్స్‌ప్రెస్ చేసిన తీరే వివాదాస్పదంగా మారింది. మల్లన్న వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ సీరియస్ గా పరిగణించింది. షోకాజ్ నోటీస్ అందజేసింది. అయినా మల్లన్న తగ్గకపోవడంతో.. తాను చార్జ్ తీసుకోగానే సస్పెన్షన్ వేటు వేయించి తన వర్కింగ్ స్టైల్ ఎలా ఉంటుందో చూపించారు మీనాక్షి నటరాజన్.. షోకాజ్ నోటీసుకు మల్లన్న రిప్లై ఇవ్వలేదని తెలిసి సీరియస్ అయిన కొత్త ఇన్చార్జ్ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డిని ఆదేశించి.. మల్లన్నను పార్టీ నుంచి కట్ చేయించారు.

సాదాసీదాగా ట్రైన్‌లో వచ్చిన మీనాక్షీ నటరాజన్

ఇక మీనాక్షి నటరాజన్ వచ్చి రాగానే పట్టభద్రుల ఎన్నిక కోసం వరసగా జూమ్ మీటింగ్స్ పెట్టి దిశానిర్దేశం చేసి నేతల్లో కొత్త జోష్ నింపారు. గాంధీ భవన్లో తొలి మీటింగ్ కండక్ట్ చేసి నేతలకు తన స్టైల్ ఆఫ్ వర్క్ మీద క్లారిటీ ఇచ్చారు. గీత దాటిన వారికి చర్యలు ఉంటాయి. అది చిన్న లీడర్ అయినా పెద్ద లీడర్ అయినా.. ఏ కులమైనా, మతమైనా పార్టీ లైన్ క్రాస్ చేసే లీడర్ల విషయంలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.. ప్రజల్లో ఉండండి, ప్రజల కోసం పనిచేయండి, పేదల చిరునవ్వుకి కారణం కండి.. అంటూ గ్రామ స్థాయి నేతల నుండి మంత్రి దాక ప్రతి ఒక్కరికి దిశానిర్ధేశం చేస్తూ.. తన సింప్లిసిటీతో అందర్నీ ఆశ్చర్యపరిచారు.

స్వాగతాలు, పూల బొకేలు, ఫ్లెక్సీలు సన్మానాలకు దూరం

సాధారణంగా.. ఢిల్లీ నుంచి కాంగ్రెస్ ఇంచార్జ్ వస్తున్నారంటే.. హైదరాబాద్ గాంధీ భవన్‌లో హడావుడి మామూలుగా ఉండదు. పార్టీ నేతల హంగామాకు హద్దే ఉండదు. కానీ.. మీనాక్షి నటరాజన్ ఫ్లైట్‌లో కాకుండా.. సాదాసీదాగా ట్రైన్‌లో రావడం చూసి అంతా సర్‌ప్రైజ్ అయ్యారు. పార్టీలో ఎంతో కీలకమైన స్థానంలో ఉన్నప్పటికీ ఆవిడ.. హంగూ, ఆర్భాటాలకు దూరంగా ఉన్నారు. ఓ సాధారణ కాంగ్రెస్ కార్యకర్తలా.. సింపుల్‌గా భూజానికి ఓ హ్యాండ్ బ్యాగు, వీపున చిన్న లగేజీ బ్యాగ్ వేసుకొని హైదరాబాద్ వచ్చేశారు. స్వాగతాలు, పూల బొకేలు, ఫ్లెక్సీలు, శాలువాలు, సన్మానాల లాంటివి తనకు నచ్చవని.. వాటికి దూరంగా ఉండాలని ముందే పార్టీ నేతలకు సూచించారు. తన బ్యాగ్ కూడా తానే మోసుకొని వచ్చారు. రైల్వే స్టేషన్ నుంచి నేరుగా.. తాను ఆన్‌లైన్‌లో సొంతంగా డబ్బులు చెల్లించి బుక్ చేసుకున్న దిల్ కుశా గెస్ట్ హౌజ్ గదిలో దిగారు. అక్కడే బస చేశారు.

అత్యవసరమైతే తప్ప ఫ్లైట్ జర్నీ చేయరు

మీనాక్షి నటరాజన్ బ్రహ్మచారిణి. చాలా సాదా సీదాగా ఉంటారు. ఎమర్జెన్సీ మీటింగులకు, రాహుల్ గాంధీ ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తున్నప్పుడు.. అత్యవసర పిలుపు వస్తే మినహా.. ఆమె ఫ్లైట్ జర్నీ చేయరని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఆమె వెంట ఎప్పుడూ రెండు జతల బట్టలే ఉంటాయి. మామూలు భోజనమే చేస్తారు. నాన్‌వెజ్‌కు దూరం. ఎక్కడికెళ్లినా.. ప్రభుత్వ గెస్ట్ హౌజ్‌లోనే మాజీ ఎంపీ హోదాలో సొంత ఖర్చుతో బస చేస్తారు. కాన్వాయ్ ప్రయాణానికి సైతం దూరంగా ఉంటారు.

గ్రూపు మీటింగులు తప్ప.. పర్శనల్ మీటింగులకు దూరం

సాధారణంగా ఆమె ఆటోలో వెళ్లేందుకే ప్రాధాన్యత ఇస్తారు. గ్రూప్ మీటింగులు తప్ప.. పర్సనల్ మీటింగులకు ఆవిడ దూరం. అంతేకాదు.. టైమ్ అంటే టైమే. సమయ పాలన కచ్చితంగా పాటిస్తారు. ఇతర గెస్టుల కోసం ఎదురుచూడరు. ఎవరొచ్చినా.. రాకపోయినా.. ఆ సమయానికి మీటింగ్ మొదలుపెట్టేస్తారు. గాంధేయ సిద్ధాంతం ఆచరణలో భాగంగా.. ప్రతి శనివారం మౌనవ్రతం పాటిస్తారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం, కాంగ్రెస్ పార్టీ కోసం ఆమె పెళ్లి కూడా చేసుకోలేదని చెబుతారు.

టాక్ ఆఫ్ ద తెలంగాణగా మారిన మీనాక్షీ నటరాజన్

అలాంటి సాఫ్ట్ లీడర్ వచ్చీ రాగానే మల్లన్నపై తీసుకున్న యాక్షన్‌తో.. టాక్ ఆఫ్ ద తెలంగాణగా మారిపోయారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దేశం కోసం స్వతంత్రం కోసం పోరాడిన పార్టీ జజజ అలాంటిది మనం ఎవరితో అయిన పోరాటం చేయగలం అంటూ కాంగ్రెస్ కేడర్‌కు బూస్టప్ ఇస్తున్న మీనాక్షి నటరాజన్ ఎంట్రీతో పార్టీ శ్రేణులు ఖుషీ అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ మెచ్చిన నాయకురాలు, టీ కాంగ్రెస్ రాజకీయాల్లో మార్పు తీసుకు వచ్చి.. తనదైన స్టయిల్‌లో పార్టీ దశ దిశ మారుస్తారని నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. అంతర్గత ప్రజాస్వామ్యానికి పెట్టింది పేరైన కాంగ్రెస్‌లో ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకునే నేతలకు ఇక కళ్లెం పడినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సస్పెన్స్ .. టెన్షన్ ! పెద్దల పీఠం దక్కేదెవరికో

హైదరాబాద్,తెలంగాణ. ఏపీలోని రెండు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీల్లో రసవత్తర పోరు ముగిసింది. ఒక వైపు టీచర్లు.. మరో వైపు గ్రాడ్యుయేట్లు బారులు తీరి.. అభ్యర్థుల జాతకాలను తెలిపే నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుకు సమర్పించారు. ఏతావాతా నోట్ల పంపిణీ, చిన్న చిన్న గొడవలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్లో రెండు గ్రాడ్యుయేట్లు, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానంలోనూ తెలంగాణలో రెండు టీచర్లు , ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో హోరాహోరీ పోరు జరిగింది. ఇక్కడ చిత్రమేమిటంటే.. ఈ రెండు రాష్ట్రాల్లోనూ అధికార పార్టీకి ప్రధాన ప్రత్యర్థి పార్టీలు పోటీ చేయలేదు. తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ అభ్యర్థులు పోటీలో లేరు. ఈ స్థితిలో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓట్లు ఎవరికి పడ్డాయో అంతు చిక్కటం లేదు. కాంగ్రెస్ను వ్యతిరేకించే బీఆర్ఎస్ బీజేపీకి మద్దతు ఇచ్చిందా? లేదా? అనేది ఈ ఎన్నికల ఫలితాలు తేలుస్తాయి. ఇక ఏపీలో వైసీపీ తమ అభ్యర్థిని నిలబెట్టలేదు. కూటమికి ప్రత్యర్థులు వామపక్ష అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. కానీ టీచర్లు ఎప్పుడూ అధికార పార్టీకే మద్దతు ఇస్తారు? ఈ స్థితిలో ఏపీ, తెలంగాణలోని టీచర్ల స్థానాల్లో అధికార పార్టీకే విజయవకాశాలు కనిపిస్తాయి. ఇక గ్రాడ్యుయేట్స్ కూడా ఇప్పటికే అధికార పార్టీకే మద్దతు పలుకుతారు. ఈ స్థితిలో ఏపీ, తెలంగాణలోని అధికార పార్టీకే పెద్దల సభలో సీట్లు దక్కుతాయని రాజకీయ పరిశీలకుల అంచనా.తెలంగాణ, ఏపీ రాజకీయాల్లో పెద్దల ఎన్నికల ఫలితాలు గుబులు రేపుతున్నాయి. ఇటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, అటు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడులో పట్టభద్రులు ఏమి గుర్తించారు. సీఎంల పని తీరుపై ఏం ఆలోచిస్తున్నారు? హామీలు నెరవేర్చక పోతే కాంగ్రెస్కు ఓటు వేయొద్దని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పట్టభద్రులకు సూచించగా.. సూపర్ సిక్సుల అమలులో ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కోరారు. ఈ రెండు చోట్ల అధికార పార్టీ పనితీరుపై పట్టభద్రుల్లో ఎలాంటి స్థితి నెలకొందో.. ఈ ఫలితాలు నిర్ణయిస్తాయి.జనం ఏం ఆలోచిస్తున్నారో.. ఈ ఫలితాలు మర్మగర్భంగా చెబుతాయి. అధికార పార్టీ గెలిచినా.. అందులో వచ్చిన ఓటు శాతం అసలు నిజాన్ని వెల్లడి చేస్తుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కృష్ణా గోదారి జిల్లాల్లో .. ఉత్కంఠప్రధాన ఎన్నికల అధికారి సమాచారం ప్రకారం తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గాల్లో 63.28 శాతం, కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాల్లో 65.58 శాతం, శ్రీకాకుళం –విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 91.82 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించ^కున్నారు. ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలకు 70 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కానీ పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు,





ఎన్డీఏ మద్దతుతో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, యూటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మధ్య పోరు నెలకొంది. ఈ త్రిముఖ పోటీలో గెలుపు ఎవరిదో.. సస్పెన్స్ నెలకొంది. కృష్ణాగుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో ఎన్డీయే అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మధ్యే పోటీ కనిపిస్తోంది. ఈ స్థానంలో 25 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ఇద్దరి మధ్యేగట్టి పోటీ తప్పలేదు. ఈ నియోజకవర్గంలో వైసీపీ కేడర్ లక్ష్మణరావుకే తమ మద్దతు ప్రకటించారు. ఇక గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఎన్నికల రసవత్తరంగా జరిగింది. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానంలో మొత్తం 35 మంది బరిలో ఉన్నారు. వీరిలో టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు, స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ పోటీపడ్డారు.

తెలంగాణలో గ్రాడ్యుయేట్లపైనే అందరి దృష్టి

తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ మూడు స్థానాల్లోనూ పోటీ చేసిన బీజేపీ తన బలాన్ని ప్రదర్శించబోతోంది. ఇక రాష్ట్రంలో ఒక స్థానంలోనే పోటీచేసిన అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక్కడ ఓడిపోతే ఎన్నికలకు రిఫరెండంగా భావించాలని బీజేపీ సవాల్ విసిరింది. ఈ స్థితిలో ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డి పాలనను పట్టభద్రులు వ్యతిరేకించారా? మరో చాన్స్ ఇచ్చారో తేలాల్సి ఉంది. ఇక రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో అధికార పార్టీకే టీచర్లు మద్దతు పలుకుతారని ఒక అంచనా. ఈ సందర్భంగా కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం అందరి దృష్టి ఆకర్షిస్తోంది. మొత్తం 56 మంది అభ్యర్థులు ఇక్కడి నుంచి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ సహా ఇండిపెండెంట్ అభ్యర్థి మధ్య తీవ్రపోటీ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. మూడో ప్రాధాన్యత ఓటుతోనే గెలిచే అవకాశాలు ఉన్నట్లు విశ్లేషకుల అంచనా. 56 మంది అభ్యర్థులు ఉన్నా.. నాలుగు, మూడు స్థానాల్లో నిలిచే అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియతోనే విజేత తేలే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా ఆస్కారుల పండగ

లాస్‌ఎంజిల్స్,యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూసిన ఆస్కార్ అవార్డుల సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన 'అనోరా'కు అవార్డుల పంట పండింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్ విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంది. 'ది బ్రూటలిస్ట్'లో నటనకు గానూ ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ.. 'అనోరా'లో నటనకు మైకీ మ్యాడిసన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. సీన్ బేకర్ (అనోరా) ఉత్తమ దర్శకుడిగా అవార్డు సొంతం చేసుకున్నారు. ఇక 'ఎ రియల్ పెయిన్' చిత్రానికి కీరన్ కైల్ కల్కిన్ ఉత్తమ సహాయ నటుడిగా.. 'ఎమిలియా పెరెజ్'లో నటనకు జోయా సాల్దానా ఉత్తమ సహాయ నటిగా ఆస్కార్ అందుకున్నారు. గతేడాది బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన 'డ్యూన్: పార్ట్2' ఉత్తమ సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆస్కార్‌ను సొంతం చేసుకుంది. ఇక లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మన దేశం నుంచి నామినేషన్‌లో నిలిచిన 'అనూజ' చిత్రానికి మాత్రం నిరాశ ఎదురైంది. ఆ కేటగిరిలో 'ఐయామ్ నాట్ ఏ రోబో' ఉత్తమ లఘు చిత్రంగా అవార్డును గెలుచుకుంది. లాస్ ఏంజెలెస్ డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరిగిన 97వ అకాడెమీ అవార్డుల వేడుకకు హాలీవుడ్ ముఖ్య తారాగణంతో పాటు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. నటీమణులు ఫ్యాషన్ ప్రపంచానికి సరికొత్త భాష్యం చెబుతూ ట్రెండీ దుస్తుల్లో మెరిశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆస్కార్ అవార్డుల వేడుకకు వచ్చిన అతిథులతో నటి, వ్యాఖ్యాత అమేలియా డిమో÷–డలెన్‌బర్గ్ చిట్‌చాట్ చేశారు. అరియానా గ్రాండే, సింథియా ఎరివో, దోజా క్యాట్, లిసా, క్వీన్ లతీఫా, రేయ్‌లు తమ ప్రదర్శనతో ఆహూతులను అలరించారు. సినీరంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డు ఆస్కార్ అత్యున్నత అవార్డును ఒక్కసారైనా అందుకోవాలని ప్రతీ నటుడు, ఆర్టిస్ట్, టెక్నీషన్ అనుకుంటూ ఉంటారు. అలాంటి అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్‌లో గల డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా సాగింది. ఈ వేడుకకు సినీ తారలతోపాటు టెక్నీషియన్స్ హాజరయ్యారు. ఉత్తమ సహాయ నటుడితో మొదలైన అవార్డుల ప్రదానోత్సవం బెస్ట్ పిక్చర్‌తో ముగిసింది.ఇక అనోరా కథ విషయానికొస్తే.. ఇదో వేశ్య కథ. రొమాంటిక్ కామెడీ డ్రామా నేపథ్యంలోనే దీన్ని తెరకెక్కించారు. రష్యాకి చెందిన కోటీశ్వరుడైన కుర్రాడు చదువుకోవడానికి అమెరికా వస్తాడు. అక్కడ 23 ఏళ్ల వేశ్యని కలుస్తాడు. ఆమెతో ప్రేమలో పడిపోతాడు. పెళ్లికూడా చేసుకుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కుర్రాడి తల్లిదండ్రులు.. ఈ పెళ్లిని అంగీకరించరు. తమ కుమారుడిని రష్యాకు తీసుకెళ్లి పోతారు. దీంతో వేశ్య ఏం చేసింది..? అతడిని వదిలేస్తుందా..? అనేది మిగతా స్టోరీ. సుమారు 6 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.52 కోట్లతో ఈ చిత్రాన్ని రూపొందించగా.. ఊహించని రీతిలో 41 మిలియన్ డాలర్లు అందుకుని కలెక్షన్లలో రికార్డులు సృష్టించిందీ చిత్రం.ఇక విడుదలకు ముందే ఈ చిత్రం పలు అవార్డులు, రివార్డులు అందుకుంది. 2024 మేలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించగా.. విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అంతేకాదు కేన్స్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'పామ్ డి ఓర్' అవార్డును సీన్ బేకర్ అందుకున్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ రూపొందించిన 10 అత్యుత్తమ చిత్రాల జాబితా–2024లో కూడా అనోరా చోటు దక్కించుకోవడం విశేషం. రెండు బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డ్సునూ అందుకుంది. ఇప్పుడు ఆస్కార్ వేడుకల్లో సత్తా చాటి.. ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది.

# కొలిక్కిరాని పంచాయితీ...

శ్రీశైలం, శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లపై పట్టు కోసం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం కొలిక్కి వచ్చేలా లేదు. ఇప్పటికీ రెండు రాష్ట్రాలు కలబడుతూనే ఉన్నాయి. 2023 డిసెంబర్ మొదటి వారంలో సాగర్ డ్యామ్‌పై ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరు రాష్ట్రాల పోలీసుల మధ్య ఇరిగేషన్ అధికారులు బాహాబాహీని తిలకించారు. నీళ్ల వాటా విషయంలో కేసీఆర్, చంద్రబాబు, జగన్, ఇప్పుడు రేవంత్.. కృష్ణా జలాల వివాదాన్ని జఠిలం చేస్తూనే ఉన్నారు. ఎన్నికలొచ్చిన ప్రతీసారీ ఇదొక ప్రచారాస్త్రంగా కూడా మారుతోంది. నదీ జలాల వివాదాలు.. ఏ రాష్ట్రానికీ కొత్త కాదు. ఏ నదికీ లేనివీ కావు. కావేరీ, నర్మద, మహానది, పెరియార్, మహాదాయి ఇలా వివాదాల్లో చిక్కుకున్న నదుల జాబితా చాంతాడంత. ఆ జాబితాలో తెలుగు రాష్ట్రాల నీటివాటాల గొడవ చాలా ప్రత్యేకం. రెండు రాష్ట్రాలకూ జీవనాధారమైన కృష్ణ, గోదావరి జలాల వివాదం కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖకు పెద్ద సమస్యలా మారింది. పాక్, భారత్ కన్నా తీవ్రంగా చూడడం సరికాదు. మహారాష్ట్రలో పుట్టి తూర్పు దిశగా పయనించి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే కృష్ణానది.. నాలుగు రాష్ట్రాల నీటి అవసరాలకు ఆసరానిస్తోంది. ఆ మేరకు వివాదాలకూ తావిచ్చింది. 70 ఏళ్లకిందట 2060 టీఎంసీలున్న కృష్ణా జలాల పంపకం దగ్గర నాలుగు రాష్ట్రాల మధ్య వివాదం ముదిరింది. పరిష్కారం కోసం రెండుసార్లు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. ట్రిబ్యునళ్లను దాటి సుప్రీంకోర్టు దాకా వెళ్లింది కృష్ణా జలాల వివాదం. రాయలసీమ ఎత్తిపోతలకు తెలంగాణ ససేమిరా అంటే.. పాలమూరు, దిండి ప్రాజెక్టుల మీద ఏపీ సర్కార్ చెయ్యడ్డం పెట్టడంతో.. గతంలో కూడా కేఆర్ఎంబీ సమావేశాల్లో వాడీవేడి చర్చలు సాగాయి. నీటివాటాలపై జగన్, కేసీఆర్ ప్రభుత్వాధినేతలుగా ఉన్నప్పుడూ రాజీ కుదిరింది లేదు. ఓక శాశ్వత పరిష్కారం వారు చూపలేక పోయారు. చంద్రబాబు, రేవంత్ సన్నిహితులే అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. అంటే ఎవరి పట్టువారిదే. ఇక్కడ ప్రజలకన్నా, రాజకీయాలే పైచేయి సాధించాయి. 2021లో కూడా కృష్ణా జలాల పంపకాలపై రెండు రాష్ట్రాల మధ్య లేఖల యుద్ధం జరిగింది. కృష్ణా జలాలను చెరి సగం పంచాలని తెలంగాణ, రెండో ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే పంపకాలు జరగాలని ఏపీ.. గట్టిగా వాదించాయి. ఉమ్మడి ప్రాజెక్టుల్లో కూడా నీటి వాటాలు ప్రాజెక్టుల వారీగా జరగలేదని కేఆర్ఎంబీ దృష్టికి ఏపీ సర్కార్ తీసుకెళ్లింది. శ్రీశైలం నుంచి చెన్నైకు, సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం మాత్రమే నీళ్లను తీసుకునేందుకు వెసులుబాటు ఉందని, మిగతాదంతా పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరింది. నాలుగేళ్లు గడిచినా.. తెలంగాణ కోరుతున్న ఫిఫ్టీ–ఫిఫ్టీ డిమాండ్ ముందుకు జరగడం లేదు. ఇదే విషయంలో పదేళ్లు నాన్చిన బిఆర్ఎస్ నేతలు నీతులు వల్లిస్తున్నారు. వాటం తీరు మాట్లాడుతున్నారు. సిగ్ఊఎగ్గూ లేకుండా పంచాయితీలో ఆజ్యం పోస్తున్నారు. నీటి వాటాల సమస్య పరిష్కారం కోసం ముందుగా చిత్తశుద్ధితో ఉండాలి. కెఆర్ఎంబి ముందు సామరస్యంగా మాట్లాడుకోవాలి. గత ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్ జలసౌధలో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. కానీ.. రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు దుమ్మా కొట్టారు. కెఆర్ఎంబి ఉనికినే ప్రశ్నిస్తున్న తెలంగాణ వాదన వివాదాస్పదంగా మారుతోంది. కెఆర్ఎంబి లేకుంటే ఏపీ, తెలంగాణ మధ్య సమన్వయం ఎలా అని కేంద్ర జలశక్తి శాఖ ప్రశ్నిస్తోంది. విభజన చట్టంలో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును ప్రతిపాదించిందే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పుడు ఆ కాంగ్రెస్ పార్టీ నుంచే వ్యతిరేకత రావడం ఏంటన్నది ఆలోచించాలి..ఏపీ, తెలంగాణ పరస్పరం మాట్లాడుకొని.. పట్టువిడుపులకు పోతే తప్ప ఈ గొడవ సద్దుమణిగేది

# రాజధానిపై ఇక వడివడిగా అడుగులు



అమరావతి,రాజధాని అమరావతి విషయంలో గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క ఇటుక కూడా వేయలేదు. సరికదా మూడు రాజధానులు అంటూ కాలం గడిపారు. చివరకు రాజధాని రాష్ట్రంగా ఎపి గిలింది. ఈ క్రమంలో ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న చర్య కారణంగా అమరావతి పట్టాలకు ఎక్కుతోంది. అమరావతిలో వివిధ పనులు మొదలయ్యాయి. అక్కడ పెరిగిన ముళ్లకంప చెట్లను ఇటీవలే తొలగిచారు. టెండర్లు ఖరారు చేసి పనులను వేంగంగా కొనసాగించేలా ముందుకు సాగుతున్నారు. అద్భుతమైన రాజధానిని నిర్మిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. హైదరాబాద్, ముంబై నగరాల సరసన ఉండేలా చేస్తామని అన్నారు. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అభివృద్ది 30 ఏళ్లు వెనక్కి పోయింది. అలాగే రాజధాని లేకుండా ఐదేళ్ల పాటు లాక్కు వచ్చారు. ఇంతకన్నా చరిత్రలో అద్భుతం ఉండదు. విభజన తరవాత ఎపికి ఉన్న వనరుల దృష్ట్యా ఎంతో అభివృద్దికి అవకాశం ఉన్నా.. సిఎం జగన్ వాటిని కాలరాసారు. ఉన్న అవకాశాలను ఉపయోగించుకోలేదు. రాజధాని అంటే ఏ రాస్ట్రానికైనా ఓ తలకాయ లాంటిది. కంప్యూటర్‌కు మదర్ బోర్డు లాంటిది. ఈ సత్యాన్ని విస్మరించి జగన్ అడుగులు వేయడంతో ఎపి అపప్రథను మూటగ్టటుకుంది. చేతికి ఎముక లేదన్నట్లుగా జగన్ డబ్బుల పందేరంతో ఓటు బ్యాంకును సృష్టించుకునే ప్రయత్నంలో అభివృద్దిని విస్మరించారు. చంద్రబాబును విమర్శించడం, విపక్ష నేతలపై కేసులు పెట్టడం ద్వారా జగన్ పురోగమించ లేకపోయారు. తండ్రి వైఎస్‌లో ఉన్న హుందాను కూడా పుణికి పుచ్చుకోలేక పోయారు. గత ప్రభుత్వానికి దూరదృష్టి లేదనడానికి రాజధానిని లేకుండా చేయడమేనని వేరుగా చెప్పనక్కరల్లేదు. విశాఖకు రాజధానిని తరలించాలన్న ఆత్రుతతో విలాసవంతమైన భవంతులను నిర్మించుకున్నారు. నిజానికి అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖకు రాజధాని తరలించివుంటే పరిస్థితి మరోలా ఉండేది. అధికారంలోఎవరు ఉన్నా ప్రజాసంక్షేమం కోరి పాలన చేయాలి. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో ఎపి కూడా 6వేల కోటలను కేటయింది. ఇక టెండర్లను ఫైనల్ చేయనుంది. నిజానికి... జగన్ సర్కారు అమరావతిని ఎప్పుడో అటకెక్కించింది. మధ్యలో మూడు రాజధానులను తీసుకొచ్చింది. న్యాయ వివాదాల నేపథ్యంలో... మూడు రాజధానుల చట్టాన్ని వెనక్కి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఏపీ రాజధాని అధికారికంగా అమరావతేనని కేంద్రం కూడా గుర్తించింది. ఈ క్రమంలో ఇంతకాలంగా గందరగోళం నడిచింది. మూడు రాజధానులు అంటూ చిచ్చు రేపారు. అమరావతి ముంపు ప్రాంతం కనుక, ఇక్కడ పెద్దగా కట్టడాలు ఏమీ లేవు కనుక, టిడిపి పార్టీ వారి భూములే ఉన్నాయి కనుక అంటూ.. దీరాలు తీస్తూ సమస్యను రాజేసారు. అయోమయ పరిస్థితిని సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడడం సరికాదు. జగన్ హయాంలో మంత్రులు, అధికార పార్టీ నాయకులు చేసిన ప్రకటనలతో రాష్ట్ర ప్రజల్లోనూ, భూములిచ్చిన రైతుల్లోనూ తీవ్ర గందరగోళం నెలకొంది. రాజధానిని నాలుగుచోట్ల చేయాలని మరికొందరు తెరపైకి వచ్చారు. మొత్తంగా గందరగోళానికే జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఐదువేల ఎకరాల్లో రాజధాని నిర్మించవచ్చని 2015 మార్చిలో అమరావతి పర్యటనకు వచ్చిన సమయంలో అప్పటి ప్రతిపక్షనేతగా జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాజధానిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందని, టిడిపిలో ఉన్న పెద్దలకు లబ్ది కలిగించే విధంగా వ్యవహరించారని, దీనిపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ప్రకటించిన విషయం విదితమే. అప్పటికే రాజధాని అమరావతిలో సుమారు 23 వేల కోట్ల రూపాయల విలువ చేసే పనులు వివిధ దశల్లో వున్నాయి. అమరావతి పరిధిలో టిడిపి నేతలు, ఆ పార్టీ అనుయాయులు కొందరు అప్పట్లో వందల ఎకరాల భూములు కొనుగోలు చేశారన్న ఆరోపణలు కూడా వైకాపా పార్టీవారు చేస్తూ వచ్చారు. కానీ ఏదీ నిరూపించలేక పోయారు. పరిపాలనా కేంద్రమైన రాజధాని విషయంలో అస్పష్టత మంచిది కాదని కాలం రుజువు చేసింది. దీంతో పెట్టుబడి పెట్టాలనుకున్న వారు వెనక్కి పోయారు. ప్రస్తుతం నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మూడేళ్లలో నగర నిర్మాణం చేస్తామని ప్రకటించింది. ఇది ఎపికి తలమానికం అయ్యేలా చూడాల్సి ఉంది.

# హైదరాబాద్‌కు మీనాక్షి నటరాజన్.. టార్గెట్ ఫిక్సయ్యింది?

హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ టార్గెట్ ఏంటి? ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ చేశారా? మంగళవారం నుంచి రెండురోజుల పాటు వివిధ పార్లమెంట్ నియోజకవర్గాలపై దృష్టి పెట్టారా? రెండు రోజులపాటు సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

హైకమాండ్ కీలక సూచనలు

ఫిబ్రవరి 19న కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే కొత్త ఇన్‌ఛార్జులతో ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలకు ఆయా ఇన్‌ఛార్జులే బాధ్యత వహించాల్సి ఉంటుందని నొక్కి వక్కానించారు. బూత్ లెవల్ నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత రాష్ట్రాల ఇన్ ఛార్జులదేనని తేల్చిచెప్పారు. ఒక విధంగా చెప్పాలంటే ఇన్‌ఛార్జులకు ఫుల్ పవర్ ఇచ్చేసింది పార్టీ హైకమాండ్.

పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా సమీక్షలు

తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన నుంచి మీనాక్షి నటరాజన్ తనదైన శైలిలో అడుగులు వేస్తున్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా మంగళవారం నుంచి సమీక్షలు చేయనున్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సమీక్షా సమావేశాలు మొదలుకానున్నాయి. మెదక్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించనున్నారు. బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంపై దృష్టి పెడతారు. ఈ సమావేశాలకు నియోజకవర్గాల మంత్రులు, ఇన్ ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులు హాజరు కావాలని పిలుపు ఇచ్చారు.

జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు

పార్టీ పరిస్థితులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై ఆయా నేతలపై మీనాక్షి నటరాజన్ చర్చించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచే ఆమె ఫోకస్ చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించనున్నారు. దీని తర్వాత జిల్లా స్థాయి




నుంచి గ్రామ స్థాయి వరకు కార్యకర్తలతో భేటీ కావాలని భావిస్తున్నట్లు గాంధీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామ స్థాయిలో జరగడంతో వాటిపై తొలుత దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అయితే ఓటు బ్యాంక్ చెదిరిపోకుండా ఉంటుందన్నది హైకమాండ్ ఆదేశాలు. ఆ విధంగా ఆమె అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులపై నేతల దృష్టి

రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తర్వాత మీనాక్షి నిర్వహిస్తున్న ఫస్ట్ సమీక్ష సమావేశాలు ఇవే. నేతలు సైతం వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. పెద్ద సంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు నేతలు సైతం సిద్ధమవుతున్నవారు.

దీని తర్వాత సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారనే వార్తలు లేకపోలేదు. పీసీసీ కార్యవర్గ కూర్పు ఈ నెల 20లోగా పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నామినేటెడ్ పదవుల్లో పెండింగ్ లో ఉన్నవాటిని భర్తీ చేయడానికి జిల్లాలవారీగా ఈనెల 10లోగా అర్హులను గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రులు ఆయా వివరాలు సేకరిస్తున్నారు. మొత్తానికి పార్టీ బలోపేతంపై చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు మీనాక్షి నటరాజన్.

# మూడో భాష మీద సీఎం స్టాలిన్ మెలిక సరే.. వాస్తవం ఏంటి?

తమిళనాడు: ఒక ఇష్యూను టేకప్ చేసిన తర్వాత దాన్ని వదిలిపెట్టకుండా కొనసాగించే విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎంత పట్టుదలగా ఉంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందునా.. ద్రవిడ సిద్ధాంతాన్ని.. తమిళ భాషకు సంబంధించిన అంశాలపై ఆయన మరింత గట్టిగా వ్యవహరిస్తుంటారు. మోడీ సర్కారు మీదా ఇప్పటికే నిప్పులు చెరుగుతున్న ఆయన.. కేంద్ర విధానాలపై తనకున్న భిన్నాభిప్రాయాల్ని వ్యక్తం చేసే విషయంలో అస్సలు తగ్గట్లేదు. ఇప్పటికే లోక్ సభ ఎంపీ నియోజకవర్గాల పునర్విభజనపైనా.. అందులో ఉత్తరాది అధిపత్యం మీదా ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్న ఆయన.. మూడో భాష అంశంపైనా తరచూ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. దక్షిణాది మీద హిందీని బలవంతంగా రుద్దుతున్నారన్న ఆయన.. ఇప్పుడో ప్రశ్నను లేవనెత్తారు. మూడో భాషగా హిందీని నేర్పాలంటున్నారు సరే.. ఉత్తరాదిన మూడో భాషగా దేన్ని నేర్పుతారు? అంటూ సరికొత్త మెలిక ప్రశ్నను సంధించారు. జాతీయ విద్యా విధానంలో మూడు భాషల్ని నేర్పాలన్న సంగతి తెలిసిందే. ఇందులో ఇంగ్లిషు.. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన భాషతో పాటు.. మూడో భాషగా హిందీని నేర్పాలన్న కేంద్రం తీరును స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. త్రిభాషా సూత్రాన్ని దక్షిణాదిన అమలు అంశాన్ని ప్రస్తావిస్తూ.. మరి ఉత్తరాదిన అమలు చేస్తే ఏ భాష నేర్పిస్తారో చెప్పాలని క్వశ్చన్ చేశారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో సోమవారం ఒక పోస్టు చేశారు. తమిళనాడు విద్యార్థులు మూడో భాషను నేర్చుకునేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ కొందరు మమ్మల్నిఅడుగుతున్నారు. కానీ.. ఉత్తరాదిలో మూడో భాషగా ఏ భాషను నేర్పుతున్నారో చెప్పటం లేదు. అక్కడ రెండు భాషల్ని మాత్రమే బోధిస్తున్నట్లయితే ఇక్కడ మాత్రం మూడు భాషల్ని నేర్చుకోవాల్సిన అవసరం ఏముంది? అన్నది సీఎం స్టాలిన్ ప్రశ్న. అటు స్టాలిన్ వైపు కాకుండా.. ఇటు మోడీ సర్కారు వైపు కాకుండా.. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుకోవాలంటే.. ఉత్తరాదిన చాలా రాష్ట్రాల్లో హిందీతో పాటు వారిదైన సొంత భాష కూడా ఉందన్నది మర్చిపోకూడదు. దక్షిణాది రాష్ట్రాల్ని పక్కన పెడితే.. ఉత్తరాది.. ఈశాన్య రాష్ట్రాల విషయానికి వస్తే.. మధ్యప్రదేశ్ లో హిందీ మాతృభాష. ఆ రాష్ట్రం నుంచి విడిపోయిన ఛత్తీస్ గఢ్ విషయానికి



వస్తే అక్కడి ప్రజలకు చత్తీస్ గఢీ మాతృభాష. మహారాష్ట్రకు మరాఠీ ఉంది. గుజరాత్ కు గుజరాతీ ఉంది. రాజస్థాన్ కు రాజస్థానీ ఉంది. హర్యానా.. పంజాబ్ లలో పంజాబీ, కశ్మీర్ లో కశ్మీరీ.. ఇలా చూస్తే.. దాదాపుగా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ఒక మాతృభాష ఉందన్నది మర్చిపోకూడదు. ఉత్తరాదిన పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే బెంగాలీ.. ఒడిశాకు ఒరియా.. అసోంలో అస్సామీ.. త్రిపురలో బెంగాలీ.. గోవాలో కొంకణి.. మణిపూర్ మణిపురి.. మేఘాలయలో ఖాసీ.. మిజోరంలో మిజో.. నాగాలాండ్ లో అయో.. సిక్కింలో నేపాలీ భాషలు మాతృభాషగా ఉన్నాయి. ఉత్తరాఖండ్.. ఉత్తరప్రదేశ్.. మధ్యప్రదేశ్.. జార?ండ్.. హిమాచల్ ప్రదేశ్.. బిహార్ లలో హిందీ ప్రధాన భాషగా ఉన్నప్పటికి.. వారికంటూ కొన్ని భాషలు స్థానిక ప్రజలకు ఉన్నాయన్నది మర్చిపోకూడదు. బీహార్ విషయానికి వస్తే అక్కడ ఉర్దూ, హిమాచల్ ప్రదేశ్ లో సంస్క్రతం.. జార?ండ్ లో భోజ్ పురి మొదలు బోలెడన్ని భాషలు ఉననాయి. ఉత్తరప్రదేశ్ లో ఉర్దూ, ఉత్తరాఖండ్ లో సంస్క్రతి భాషల్ని నేర్చుకుంటూ ఉంటారు. మొత్తంగా చూస్తే.. స్టాలిన్ లాంటి అధినేతల స్టేట్ మెంట్లు విన్నంతనే మెలికి పెట్టినట్లుగా ఉన్నప్పటికి.. లోతుల్లోకి వెళితే.. ఆయన వాస్తవాలు మరోలా ఉండటం కనిపిస్తుంది. భావోద్వేగాలు మంచివే కానీ.. అవేమీ దేశ సమైక్యతను ప్రశ్నించేలా మాత్రం ఉండకూడదన్నది మర్చిపోకూడదు.

# బీఎస్పీని చీల్చే కుట్ర.. మేనల్లుడిని సాగనంపిన మాయావతి



'లక్నో:చేసిన డ్యామేజ్ చాలు.. ఇక పార్టీ నుంచి దయచేయు' అంటూ సొంత మేనల్లుడినే బీఎస్పీ నుంచి బహిష్కరించి షాక్ ఇచ్చింది ఆ పార్టీ అధినేత్రి మాయావతి. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తీసుకున్న ఈ సంచలన నిర్ణయం చర్చనీయాంశమైంది. తన రాజకీయ వారసుడిగా ప్రచారం సాగిన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీలోని అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించిన మరుసటి రోజునే ఈ నిర్ణయం ప్రకటించారు. ఆకాష్ ఆనంద్‌కు పార్టీ షోకాజ్ నోటీసు పంపగా ఆయన స్పందన 'స్వార్థపూరితమైనది, అహంకారపూరితమైనది' అని మాయావతి తీవ్రంగా విమర్శించారు.

– ఆశోక్ సిద్ధార్థ్ ప్రభావం

మాయావతి ప్రకటన ప్రకారం.. ఆకాష్ ఆనంద్‌పై ఇప్పటికే బహిష్కరించబడిన మామ అశోక్ సిద్ధార్థ్ ప్రభావం ఉన్నట్లు స్పష్టమైంది. "ఆకాష్ తన చర్యలపై పశ్చాత్తాపం చెంది, రాజకీయ పరిపక్వతను ప్రదర్శించాలి. కానీ ఆయన అందుకు విరుద్ధంగా మామ అశోక్ తో కలిసి పార్టీని విభజించాలని కుట్ర చేస్తున్నారు. ఇది పశ్చాత్తాపం కాదు, స్వార్థం.. అహంకారానికి నిదర్శనం" అని మాయావతి ఎక్స్‌లో పేర్కొన్నారు.

– బీఎస్పీ పునాది విలువలు

బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ ఆత్మగౌరవ ఉద్యమం, బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ అనుసరించిన క్రమశిక్షణా సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని, ఆకాష్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరించడం అనివార్యమైందని మాయావతి తెలిపారు. మామ అశోక్ సిద్ధార్థ్‌ను బహిష్కరించిన విధంగానే ఆకాష్ ఆనంద్ విషయంలో కూడా అదే నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

– బహుజన్ సమాజ్ పార్టీలో విభజన కుట్ర

ఇటీవల మాయావతి, ఆకాష్ ఆనంద్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా బీఎస్పీని రెండు వర్గాలుగా విభజించేందుకు కుట్ర జరుగుతోందని, అందులో ఆకాష్ ఆనంద్ కూడా భాగస్వామి అయ్యారని ఆరోపించారు. ఇది పూర్తిగా సహించరానిదని ఆమె తేల్చి చెప్పారు. జరిగిన బీఎస్పీ సమావేశంలో పార్టీకి సంబంధించిన అన్ని పదవుల నుంచి ఆకాష్ ఆనంద్‌ను తొలగించినట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం బీఎస్పీ రాజకీయాలలో కొత్త మలుపు తీసుకొచ్చింది. ఆకాష్ ఆనంద్ భవిష్యత్తు రాజకీయ ప్రస్థానం ఏ విధంగా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, మాయావతి నిర్ణయం బీఎస్పీ శ్రేణుల్లో కొత్త దిశను నిర్దేశించబోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కారు రివర్స్ గేర్! కవిత ఇలాకాలో కనిపించని లీడర్లు



హైదరాబాద్, ఒకప్పుడు ఆ జిల్లా బీఆర్ఎస్‌కి కంచుకోట. కానీ ఇప్పుడు ఆ జిల్లాలో పార్టీ క్యాడర్‌కి ధైర్యం చెప్పే బాస్ కరువయ్యాడట. గత 10 ఏళ్లలో 8 నుంచి 9 ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్న గులాబీ పార్టీ పరిస్థితి అక్కడ అంత దయనీయంగా ఎందుకు తయారైంది? ఆ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు ఎందుకు ముఖం చాటేస్తున్నారు?. పార్టీ అధినేత ఆదేశాలను సైతం ఎందుకు పట్టించుకోవడం లేదు? అసలింతకీ ఆ జిల్లా ఏది? అక్కడ గులాబీ పార్టీలో ఏం జరుగుతుంది?నిజామాబాద్ జిల్లాలో తాజా మాజీ ఎమ్మెల్యేల తీరు పై.. గులాబీ క్యాడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉంటే.. నేతలు నియోజకవర్గానికి ముఖం చాటేస్తుండటం కార్యకర్తలకు మింగుడు పడటం లేదంట. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిస్తే జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో అసలు ఉలుకు పలుకే ఉండటం లేదంట. బాల్కొండ లో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అడపాదడపా నియోజకవర్గంలో పర్యటిస్తూ క్యాడర్‌ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కామారెడ్డిలో బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అయినట్లే అంటున్నారట. బాన్సువాలో మాజీ మంత్రి, మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికార పార్టీలో చేరి కారు టైర్లను పంచర్ చేశారు. దాంతో అక్కడ గులాబీ పార్టీకి లీడర్ లేకుండా పోయాడు. ఆర్మూర్‌లో మొక్కుబడిగా కనిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారంట. బోధన్‌లో మాజీ ఎమ్మెల్యే షకీల్ అయితే ఓడినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గం ముఖం చూడలేదు. షకీల్ దుబాయ్‌కి పరిమితం అవ్వడంతో ఆయన భార్య భార్య అయేషా ఫాతిమా ఇన్చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే రాజకీయాలకు పూర్తిగా కొత్త అయిన ఆమె క్యాడర్‌ని కపడుకోలేక పోతున్నారు. ఇక నిజామాబాద్ అర్బన్, రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు కేటీఆర్ ఆదేశాలను కూడా లైట్ తీసుకున్నారట. ముందుండి నడిపించే నాయకుడు లేక పోవడంతో ఆ నియోజకవర్గాల్లో పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను కూడా నిర్వహించే దిక్కు లేకుండా పోయిందంట. జామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యిందట. మొన్నటి వరకు మేయర్‌గా బీఆర్ఎస్ నాయకుడు కొనసాగినప్పుడు అంతో ఇంతో హడావుడి కనిపించేది. అయితే కౌన్సిల్ కాలం చెల్లి మేయర్ పదవీ కాలం అయిపోవడంతో అర్బన్‌లో పార్టీకి లీడర్ లేకుండా పోయాడంట. మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్‌గుప్తా పార్టీని వీడే వారిని బుజ్జగించే ప్రయత్నం కూడా చేయడం లేదంట. నిజామాబాద్ రూరల్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనంతరం. నియోజకవర్గం లోనే ఉన్నప్పటికీ.. ఆయన యాక్టివ్‌గా లేకపోవడంతో గులాబీ క్యాడర్ మొత్తం హస్తం గూటికి క్యూ కట్టారట. అధిష్టానం ఇప్పుడు రూరల్ నుంచి కాకుండా గతంలో బాన్సువాడ ఎమ్మెల్యే గా అనుభవం ఉన్న బాజిరెడ్డిని మళ్ళీ వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేయాలని చెపుతున్నా.. ఆయన సుముఖంగా లేరన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ క్యాడర్ని ఉత్సాహపరచడానికి జిల్లాలో పర్యటిస్తున్నా.. నేతలు, వారి సహకారం కరువవ్వడంతో పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టు అన్నట్లు తయారైందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.. ఓవరాల్‌గా చూస్తే జిల్లాలో కారు .. రివర్స్ గేర్లో .. ఫుల్ స్పీడ్‌తో.. పరుగులు పెడుతున్నట్లు కనిపిస్తోందిప్పుడు.

# కొన్ని కోరికలు తీరవ్వు.. అసెంబ్లీలో రఘురామ మాట విన్నారా?

అమరావతి,ఆసక్తికర వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తుంటారు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ క్రిష్ణరాజు. అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయాన్ని కూటమి సొంతం చేసుకున్న సందర్భంగా చాలామంది మాట్లాడుకున్న ఒక అంశం.. ఎమ్మెల్యేగా గెలిచిన రఘురామ క్రష్ణరాజుకు ఎలాంటి పదవిని అప్పగిస్తారు? అని. కొందరు మంత్రి అనుకుంటే.. మరికొందరు స్పీకర్ అన్న వాదనను వినిపించారు. మొత్తంగా.. ఆయనకు డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించారు చంద్రబాబు. ఆయన సభాధ్యక్ష స్థానంలో ఉన్న సందర్భంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సభలో ఉంటే ఎలా ఉంటుందన్నది అందరికి ఎంతో ఆసక్తి కలిగించిన అంశం. అదే విషయాన్ని రఘురామ కూడా కొన్ని సందర్భాల్లో చెప్పారు. అయితే.. ఆయన కోరుకున్నట్లుగా జరగని పరిస్థితి. ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే సభకు హాజరు కామన్న వాదనను తెర మీదకు తీసుకురావటం.. తర్వాత జరుగుతున్న పరిణామాలు తెలిసిందే. ఈ మధ్యనే అసెంబ్లీకి హాజరైన ఆయన కేవలం పదకొండు నిమిషాలు మాత్రమే ఉండటం.. దీనిపై భారీ చర్చ జరిగింది. అయితే.. తాను కోరుకున్నట్లుగా సభలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చూడటం ద్వారా తన కోరిక తీరినట్లుగా రఘురామ పేర్కొన్నారు. తాజాగా బడ్జెట్ పై చర్చ సందర్భంగా ఏపీ అసెంబ్లీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు నోటి నుంచి ఆసక్తికర వ్యాఖ్య వచ్చింది. వైసీపీ సభ్యులు సభకు హాజరు కావటం లేదని.. వారు హాజరవ్వాలని తాను కోరుకున్నట్లుగా పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో తననుచావు వరకు తీసుకెళ్లారన్న ఆయన.. అసెంబ్లీకి వైసీపీ సభ్యులురావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే వ్యాఖ్యలపై స్పీకర్ స్థానంలో కూర్చున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ స్పందించారు. 'కొన్ని కోరికలు తీరవు' అంటూ తన మనసులోని మాటను చెప్పేశారు. మొత్తంగా తాను సభాధ్యక్ష స్థానంలో ఉన్న వేళలో వైసీపీ అధినేత.. సభ్యులు అసెంబ్లీకి హాజరవ్వాలని తానెంత బలంగా అనుకుంటున్న విషయాన్ని రఘురామ మరోసారి చెప్పకనే చెప్పేశారని చెప్పాలి. ఇదిలా ఉండగా.. బడ్జెట్ పై చర్చ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఇంగ్లిషులోప్రసంగించారు. దీంతో డిప్యూటీ స్పీకర్ హోదాలో



రఘురామ స్పందించారు. తెలుగులో మాట్లాడితే బాగుంటుందన్న ఆయన.. 'ఇదే విషయాన్ని కొందరు సభ్యులు సూచిస్తున్నారు. మీ నియోజకవర్గంలోని ప్రజలకు కూడా స్పష్టంగా తెలుస్తుంది. సౌకర్యవంతంగా లేకపోతే మీ ఇష్టం' అని పేర్కొన్నారు.

## అయోధ్యలో చెప్పుల తొలగింపు సమస్య

అయోధ్య, ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళా భక్తుల రద్దీ అయోధ్యను కూడా తాకడంతో స్థానిక నగర పాలికకు గత నెల రోజులుగా గుట్టలుగా పేరుకుపోతున్న చెప్పుల తొలగింపు పెద్ద సమస్యగా మారింది. ప్రతిరోజూ లక్షల సంఖ్యలో భక్తులు విడిచిపెడుతున్న పాదరక్షల తరలింపునకు అధికారులు ప్రొక్లెయిన్లు, ట్రాలీలను వాడాల్సి వస్తోంది. ఆలయంలోకి రాక, పోకల నిబంధనలు మార్చడమే ఈ సమస్యకు కారణం. ఆలయ ప్రవేశంలో ఉన్న మొదటి గేటు వద్ద భక్తులు చెప్పులు విడిచిపెడతారు. గుడి లోపల దాదాపు అర కిలోమీటరు మేర ఉన్న వృత్తాకార మార్గాల్లో తిరిగి, దర్శనానంతరం మళ్లీ అదే గేటు నుంచి ఇదివరకు బయటకు వెళ్లేవారు. నెల రోజులుగా విపరీతమైన రద్దీ ఉండటంతో 3వ నంబరు గేటు నుంచి బయటకు పంపుతున్నారు. మళ్లీ మొదటి గేటు వద్దకు వచ్చి చెప్పులు తీసుకోవాలంటే అయిదారు కిలోమీటర్లు నడవాలి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com